

అడ్డంకులెన్నో..!

మచిలీపట్నం-విజయవాడ జాతీయ రహదారి-65 విస్తరణపై నీలినీడలు

క్రాస్ క్లోవర్ లీఫ్ ఆకృతి నిర్మాణ ప్రాంతంపై రైతుల అభ్యంతరం

మచిలీపట్నం- విజయవాడ జాతీయ రహదారి-65 విస్తరణపై నీలి నీడలు కమ్ముకున్నాయి. క్రాస్ క్లోవర్ లీఫ్ ఆకృతి నిర్మాణ ప్రాంతంలో భూముల సేకరణపై ఆయా రైతుల నుంచి అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. రహదారి నిర్మాణం కోసం ఇప్పటికే రెండు సార్లు భూములు ఇచ్చామని, మూడో సారి ఇవ్వాలంటే ఎలా అని ప్రశ్నిస్తున్నారు. న్యాయవాదుల ద్వారా తమ అభ్యంతరాలను కలెక్టర్‌కు విన్నవించారు. స్పందించిన ఆయన పరిశీలించి తగు నిర్ణయం తీసుకోవాలని ఫైల్‌ను మోర్త్ అధికారులకు పంపించారు.

- ఇప్పటికే రెండుసార్లు భూములిచ్చాం.. మూడో సారి అంటే ఎలా?
- న్యాయవాదుల ద్వారా కలెక్టర్‌కు తమ అభ్యంతర పత్రాలు
- స్పందించిన కలెక్టర్.. మోర్త్ అధికారులకు ఫైల్
- పరిశీలించి నిర్ణయం తీసుకోవాలని విజ్ఞప్తి

(ఆంధ్రజ్యోతి- మచిలీపట్నం): మచిలీపట్నం - విజయవాడ జాతీయ రహదారి-65, జాతీయ రహదారి- 216 ఎస్.ఎన్.గొల్లపాలెం వద్ద కలుస్తాయి. ఇక్కడ మచిలీపట్నం పోర్టు నుంచి సరుకు ఎగుమతులు, దిగుమతుల కోసం క్రాస్ క్లోవర్ లీఫ్ ఆకృతిలో భారీ స్థాయిలో రహదారిని విస్తరించనున్నారు. జాతీయ రహదారికి ఇరువైపులా సుమారు 80 ఎకరాలకుపైగా భూమి అవసరమని అధికారులు నిర్ణయించారు. ఈ ప్రాజెక్టుకు సంబంధించి భూసేకరణ కోసం గత సెప్టెంబరు 26వ తేదీన గెజిట్ నోటిఫికేషన్‌ను తయారు చేశారు. అక్టోబరు 14వ తేదీన పత్రికా ప్రకటనను జారీ చేశారు. దీంతో రైతులు గతంలోనే రహదారికి రెండు సార్లు భూమిని ఇచ్చామని, మూడో సారి భూమిని ఇవ్వలేమని అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నారు.

మోర్త్ అధికారుల దృష్టికి రైతుల అభ్యంతరాలు

మచిలీపట్నం-విజయవాడ జాతీయ రహదారి-65ను ఎస్.ఎన్.గొల్లపాలెం వద్ద క్రాస్ క్లోవర్ లీఫ్ ఆకృతిలో విస్తరణకు సంబంధించిన డీపీఆర్‌పై రైతులు అభ్యంతరాలు వ్యక్తం చేస్తూ ఇచ్చిన వినతి పత్రాలను కలెక్టర్ బాలాజీ పరిశీలించారు. అనంతరం వాటిని రైతులకు తగు న్యాయం చేయాలని మోర్త్ అధికారులకు పంపారు. కలెక్టర్ పంపిన ఫైలుపై మోర్త్ అధికారులు సముచిత నిర్ణయం తీసుకోకుంటే కోర్టును ఆశ్రయిస్తామని భూమి కోల్పోయే రైతులు అంటున్నారు. ఈ వ్యవహారంపై రానున్న రోజుల్లో అధికారులు, రైతులు తీసుకునే నిర్ణయంపైనే రహదారి విస్తరణ ఆధారపడి ఉంటుంది.

మచిలీపట్నం - విజయవాడ జాతీయ రహదారి - 216 కలిసే ప్రాంతం



పెడనలో డీపీఆర్‌ను మార్చివేశారా!

పెడన తోటమూల సెంటరు నుంచి గుడివాడ, హనుమాన్‌జంక్షన్ మీదుగా జాతీయ రహదారి-30ను విస్తరించేందుకు డీపీఆర్‌ను తయారు చేశారు. పెడన వద్ద తమ భూములు కొంతమేర పోతే మిగిలిన భూములకు ధర పెరుగుతుందనే కారణంతో ఈ రహదారి విస్తరణను వివిధ రూపాల్లో మలుపులు తిప్పారనే ఆరోపణలు కొందరు రైతుల నుంచి వినిపిస్తున్నాయి. పాఠశాల ఆవరణ స్థలంతో పాటు, కొన్ని గృహాలను తొలగించేలా డీపీఆర్‌ను తయారు చేశారు. దీంతో స్థానిక రైతులు కొందరు జాతీయ రహదారి-30 కోసం రూపొందించిన డీపీఆర్‌లో మోర్త్ అధికారులు పొరపాట్లు చేశారని, వాటిని సరిదిద్దాలని కోరుతూ కలెక్టర్, మచిలీపట్నం ఆర్డీవో కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు.

రైతుల అభ్యంతరాలు ఇవీ..


- మచిలీపట్నం పోర్టు అభివృద్ధి జరిగితే మచిలీపట్నం పోర్టు అనుబంధ పరిశ్రమలు రావడానికి అవకాశం ఉంటుంది. దీంతో పాటు పర్యాటకంగాను ఈ ప్రాంతం అభివృద్ధి చెందుతుంది. దీంతో నగర జనాభా 10 లక్షల వరకు చేరే అవకాశం ఉంది.
- మచిలీపట్నం పోర్టు అభివృద్ధి చెందితే నగరాన్ని ఎలా విస్తరించాలనే అంశంపై గతంలో మచిలీపట్నం మాస్టర్ ప్లాన్ రూపొందించారు. ఈ ప్లాన్‌లో ఎస్.ఎన్.గొల్లపాలెం వద్ద రహదారి విస్తరణకు బదులుగా, గూడూరు మండలం తరకటూరు నుంచి జాతీయ రహదారిని ప్రారంభించి మచిలీపట్నం మండలంలో జాతీయ రహదారి 216 కలిసే ప్రాంతం హర్ష కాలేజీ వరకు ఎలాంటి మలుపులు లేకుండా నిర్మాణం చేయాలని నమూనా తయారు చేశారు. ఈ ప్లాన్‌ను అమలు చేయాలి.
- మచిలీపట్నం మాస్టర్ ప్లాన్‌లో చూపిన విధంగా కాకుండా, మోర్త్ అధికారులు మచిలీపట్నం నగరం అంచున క్రాస్ క్లోవర్ లీఫ్ ఆకృతిలో నిర్మాణం చేసేందుకు, అది కూడా నేరుగా కాకుండా 'వి' ఆకారంలో

మిగతా 6లో..

విభిన్న ప్రతిభకు ప్రోత్సాహం

వేడుకగా అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవం

- ముఖ్య అతిథిగా సీఎం చంద్రబాబు హాజరు
- దివ్యాంగులకు ఉపకరణాలు, ల్యాప్ టాప్‌లు, స్మార్ట్ ఫోన్‌ల పంపిణీ
- సమస్యలపై వినతుల స్వీకరణ
- దివ్య పాదం పుస్తకావిష్కరణ





హాజరైన దివ్యాంగులు, (ఇన్‌సెట్‌లో) మాట్లాడుతున్న సీఎం చంద్రబాబు

విజయవాడ సిటీ, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): నగరంలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవం రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో బుధవారం వేడుకగా జరిగింది. రాష్ట్రంలోని పలు ప్రాంతాల నుంచి దివ్యాంగులు ఈ కార్యక్రమానికి ఉత్సాహంగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పలువురు చిన్నారులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కళాక్షేత్రం ఆవరణలో మంగళగిరి రోటరీ క్లబ్, నెల్లూరు సీఆర్‌సీ, ఏలూరు డీడీఆర్‌సీ, ఏపీ విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ, ఆర్టిఫిషియల్ లింబ్స్ మ్యానుఫ్యాక్చరింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను సీఎం చంద్రబాబు ఆసక్తిగా తిలకించారు. కార్యక్రమంలో భాగంగా పలువురు దివ్యాంగులకు మోటారు వాహనాలు, వీల్ చైర్‌లు, ల్యాప్‌టాప్‌లు, స్మార్ట్ ఫోన్‌లు, ఉపకరణాలను సీఎం అందజేశారు. దీంతో పాటు ఇటీవల జరిగిన అంధుల ప్రపంచ క్రికెట్ టోర్నీలో సత్తా చాటి జట్టు విజయంలో కీలక భూమిక పోషించిన కరుణకుమారిని సీఎం అభినందించారు. ఆమె పట్టుదల నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలని హితవు పలికారు. ఎలాంటి వసతులు లేని పాఠశాలలో చదివి, సరైన మైదానం లేని

మిగతా 6లో..

టెన్త్ విద్యార్థి ఆత్మహత్య



ఆత్మహత్య చేసుకున్న విద్యార్థి యశ్వంత్ (ఫైల్)

రూ.1500 దొంగతనం చేశాడని పొరుగింటి వారి నింద

- మనస్తాపంతో తనువు చాలించిన బాలుడు
- పామర్రు 1వ వార్డులో ఘటన
- అంత్యక్రియల్లో పాల్గొన్న ఎమ్మెల్యే వర్ల

పామర్రు, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): దొంగతనం చేశావని పొరుగింటి వారు మోపిన నింద భరించలేక పదో తరగతి విద్యార్థి ఆత్మహత్య చేసుకున్న ఘటన పామర్రులో బుధవారం జరిగింది. కుటుంబ సభ్యుల కథనం ప్రకారం... స్థానిక ఒకటో వార్డులో నివాసముండే కైలే రాజేష్, ధనలక్ష్మి దంపతుల కుమారుడు యశ్వంత్ (15) మండలంలోని జమీదగ్గుమిల్లి జిల్లా పరిషత్ హైస్కూల్లో పదో తరగతి చదువుతున్నాడు. తండ్రి లారీ డ్రైవర్‌గా, తల్లి బేకరీలో పనిచేస్తూ కుమారుడు, కుమార్తెలను చదివించుకుంటున్నారు. వారి ఇంటి సమీపంలో ఉన్న ఓ కుక్కను కొట్టేందుకు యశ్వంత్ వెళ్లగా, పొరుగు ఇంట్లో నివాసం ఉండే వారు యశ్వంత్ తమ ఇంట్లోకి వచ్చి రూ1500 దొంగతనం చేశాడని నింద మోపారు. దీంతో మనస్తాపం చెందిన విద్యార్థి యశ్వంత్ ఉదయం ఇంట్లో ఫ్యానుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే స్థానిక సీహెచ్‌సీకి తరలించారు. పరిశీలించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు ధ్రువీకరించారు. తమ బిడ్డ మరణానికి పొరుగు ఇంట్లో ఉంటున్న బొడ్డు సోమేశ్వరరావు, శిరీష, సాంబశివరావు, నాగేశ్వరమ్మ, వారి కుటుంబసభ్యులే కారణమని యశ్వంత్ తల్లిదండ్రులు, బంధువులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్సై రాజేంద్రప్రసాద్ కేసు నమోదు చేసి, పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని గుడివాడ ఏరియా ఆస్పత్రికి తరలించారు. అనంతరం కుటుంబసభ్యులకు అప్పగించారు. యశ్వంత్ మృతదేహాన్ని ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా సందర్శించి, తల్లిదండ్రులను ఓదార్చారు. యశ్వంత్ అంతిమ యాత్రలో పాల్గొని పాడె మోశారు.

రైతుల ఆదాయం పెంపుతోనే రాష్ట్రం సుభిక్షం

- మంత్రి కొల్లు రవీంద్ర
- బందరు మండలం గుండుపాలెంలో 'రైతన్నా మీ కోసం' నిర్వహణ

6

మడ విధ్వంసం!

పెదపట్నంలో బరితెగించిన అక్రమార్కులు

ఇలాగే వదిలేస్తే మిగిలిన అడవులు కనుమరుగే..

పట్టించుకోని అధికారులు.. ఆందోళనలో ప్రజలు

- మడ చెట్లు నరికి రొయ్యల చెరువుల తవ్వకం
- ఈ ప్రాంతంలో మొత్తం 5 వేల ఎకరాల్లో మడ అడవులు
- తాజాగా 1,710 ఎకరాల్లో చెట్ల నరికివేత
- గతంలో 1,000 ఎకరాలు హాంఫట్

పెదపట్నంలో మడ చెట్లు నరికి రొయ్యల చెరువులుగా తవ్విన ప్రాంతం



(ఆంధ్రజ్యోతి, విజయవాడ): మొన్న పెడన.. నిన్న బంటుమిల్లి.. నేడు పెదపట్నంలో అక్రమార్కులు బరితెగించారు. మడ చెట్ల నరికివేతను యథేచ్ఛగా కొనసాగిస్తున్నారు. సముద్రం ఆటుపోట్లను నిలువరించడంతో పాటు సునామీల తీవ్రతను తగ్గించే మడచెట్లను కనుమరుగు చేస్తున్నారు. మొత్తం ఐదు వేల ఎకరాల మడ అడవులు ఉండగా.. గతంలో వెయ్యి ఎకరాలకుపైగా నరికేశారు. తాజాగా మరో 1,710 ఎకరాల్లో చెట్లను తొలగించారు. ఆ భూములను ఎక్కడికక్కడ రొయ్యల చెరువులుగా మార్చేశారు. ప్రస్తుతం పెదపట్నం పరిధిలో మరో 2,300 ఎకరాలు మాత్రమే మడ అటవీ విస్తీర్ణం మిగిలింది. మరో ఏడాది ఇలాగే కొనసాగితే అది కూడా కనుమరుగుకావటం ఖాయం.




ఫిర్యాదులు చేసినా చర్యలు శూన్యం

మడ చెట్ల నరికివేత పర్యావరణ వినాశనానికి దారితీస్తోంది. దీనిపై జిల్లా స్థాయిలో నిర్వహించే గ్రీవెన్స్‌కు ప్రజలు పెద్ద ఎత్తున ఫిర్యాదులు చేస్తున్నారు. జిల్లా యంత్రాంగం సీరియస్‌గా తీసుకోకపోవటం అనేక ఆరోపణలకు, విమర్శలకు దారితీస్తోంది. సాగర తీరానికి రక్షణగా ఉన్న మడచెట్లను సంరక్షించేందుకు కలెక్టర్ బాలాజీ వివిధ శాఖల భాగస్వామ్యంతో వెంటనే హై లెవల్ కమిటీ

మిగతా 6లో..

అధికారులు, ప్రజాప్రతినిధుల అండ!

పెడన, బంటుమిల్లి, మచిలీపట్నం మండలాల్లో జరుగుతున్న మడచెట్ల విధ్వంసం అంతా, ఇంతా కాదు. వ్యవస్థలన్నీ పర్యావరణ పరిరక్షణ, భవిష్యత్తు ఉపద్రవాలను గాలికొదిలేశాయి. రెవెన్యూ, అటవీ, ఇరిగేషన్, మత్స్యశాఖలు అవినీతి మత్తులో జోగుతున్నాయి. ఫలితంగా సాగర తీరాన మడచెట్ల నరికివేత భారీ ఎత్తున జరుగుతోంది. నరికివేసిన భూములకు రెవెన్యూ పట్టాలిచ్చేస్తోంది. పబ్లిక్ వర్క్స్ డిపార్ట్‌మెంట్ (పీడబ్ల్యూడీ)కి చెందిన భూముల్లో ఉన్న మడచెట్ల నరికివేత జరిగి.. రొయ్యల చెరువులుగా ఏర్పాటు జరుగుతున్నా కూడా ఆ శాఖ పట్టించుకోవటం లేదు. అధికారులు, ప్రజాప్రతినిధుల అండదండలు పుష్కలంగా ఉండటంతో అక్రమార్కులు రెచ్చిపోతున్నారు.



సంస్కారవంతమైన రాజకీయాలు చేయాలి

- మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు
- కంకిపాడు ఆయాన కన్వెన్షన్ సెంటర్‌లో జన్‌సంఘ్ జేష్ఠ కార్యకర్తల ఆత్మీయ సమావేశం

6

నేడు కలశజ్యోతి ఉత్సవం

ప్రకృతి వ్యవసాయం ఆరోగ్యదాయకం

- కో-ఇంపాక్ట్ ఆసియా రీజనల్ డైరెక్టర్ శగున్ సబర్వాల్
- బాపులపాడు మండలంలో పర్యటన

6

అగ్రిగోల్డ్ బాధితుల ఆవేదన దీక్ష

పీఏసీఎస్‌ల్లో రూ.కోట్లలోనే అవినీతి!


గోకవరం సొసైటీలో ఐదేళ్లలో రూ. 6 కోట్ల వరకు అక్రమాలు!

- కార్యదర్శి ఆస్తుల క్రయవిక్రయాలపై ఆంక్షలు
- తుదిదశకు విచారణ.. త్వరలో ఉన్నతాధికారులకు నివేదిక
- శివగంగ, తరకటూరు సొసైటీల్లో కొనసాగుతున్న విచారణ

మచిలీపట్నం టౌన్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాల జమా, లెక్కలను కంప్యూటరీకరించిన నేపథ్యంలో జిల్లాలోని వివిధ ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల్లో కోట్లాది రూపాయల అవినీతి, అక్రమాలు ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్నాయి. గత వైసీపీ పాలనలో సహకార సంఘాలపై సరైన పర్యవేక్షణ లేకపోవడంతో కార్యదర్శులు రైతులు కట్టిన రుణాల సొమ్మును బొక్కేశారు. తాజాగా గోకవరం, శివగంగ ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాల్లోని అక్రమాల లెక్కలు కొలిక్కి వస్తున్నాయి. గోకవరం సహకార సంఘంలో కార్యదర్శి సుమారు రూ.6 కోట్ల వరకు అవినీతికి పాల్పడినట్లు సమాచారం.

శివగంగలోనూ కొనసాగుతున్న విచారణ

శివగంగ ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘంలోనూ అక్రమాలు వెలుగు చూశాయి. కార్యదర్శి అక్రమాలకు పాల్పడినట్టు ఫిర్యాదులు అందాయి. దీంతో శివగంగ ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘంలో జరిగిన అక్రమాలపై విచారణ ప్రారంభించారు. డివిజనల్ కో ఆపరేటివ్ రిజిస్ట్రార్ రామును విచారణాధికారిగా నియమించారు. అయితే శివగంగ సహకార సంఘంలో అవినీతి పెద్ద మొత్తంలో జరిగిందని తెలుస్తోంది. విచారణ పూర్తయితే కానీ ఏ మేరకు అవినీతి జరిగిందో పూర్తి స్థాయిలో తెలియదని విచారణాధికారి రాము తెలిపారు.



గోకవరం ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘంలో రికార్డులు పరిశీలిస్తున్న విచారణాధికారి నాగమల్లేశ్వరరావు

కూటమి ప్రభుత్వం వచ్చాక విచారణ

కూటమి ప్రభుత్వం వచ్చాక కొత్తగా త్రిసభ్య కమిటీలను ఏర్పాటు చేశారు. గోకవరం సొసైటీ త్రిసభ్య కమిటీ చైర్మన్ మీనం నాగేశ్వరరావు నియమితులయ్యారు. సహకార సంఘ సభ్యులు తమ రుణాలను చెల్లించినా మళ్లీ చెల్లించాలని సొసైటీ నుంచి నోటీసులు రావడంతో చైర్మన్‌ను కలిసి వివరించారు. దీంతో ఈ సమస్యను మంత్రి కొల్లు రవీంద్ర దృష్టికి మీనం నాగేశ్వరరావు తీసుకెళ్లారు. మంత్రి రవీంద్ర జిల్లా సహకార

మిగతా 6లో..

నేడు దుర్గగుడిలో కలశజ్యోతి ఉత్సవం..



ఇంద్రకీలాద్రి, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మార్గశిర పౌర్ణమిని పురస్కరించుకుని దుర్గగుడిలో భవానీదీక్ష విరమణల సందర్భంగా గురువారం సాయంత్రం దేవస్థానం ఆధ్వర్యంలో కలశ జ్యోతి మహోత్సవం నిర్వహిస్తున్నట్టు ఈవో శీనానాయక్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సత్యనారాయణపురంలోని శృంగేరి శారదా పీఠం పరిపాలిత శివరామ కృష్ణ క్షేత్రం (రామకోటి) నుంచి గురువారం సాయంత్రం 6 గంటలకు నగరోత్సవంగా కలశజ్యోతి ఊరేగింపు ప్రారంభమవుతుందని తెలిపారు. విజయవాడ నుంచే కాకుండా ఇతర జిల్లాల నుంచి కూడా భవానీదీక్షాదారులు తరలిరానున్నారు.

నేడు దుర్గమ్మ గిరి ప్రదక్షిణ

పౌర్ణమి సందర్భంగా దుర్గామల్లేశ్వర దేవస్థానంలో గురువారం ఉదయం 5.55 గంటలకు గిరిప్రదక్షిణ నిర్వహించనున్నట్టు ఆలయ ఈవో వీకే శీనానాయక్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. దుర్గగుడి టోల్‌గేట్ వద్ద కామధేను అమ్మవారి ఆలయం నుంచి గిరి ప్రదక్షిణ ప్రారంభమవుతుందని, అక్కడి నుంచి కుమ్మరిపాలెం సెంటర్, సితార సెంటర్, కబేళా సెంటర్ మీదుగా మిల్క్‌ప్రాజెక్టు, చిట్టినగర్, కొత్తపేట నెహ్రూబొమ్మ సెంటర్, బ్రాహ్మణవీధి, రథం సెంటర్ అక్కడి నుంచి తిరిగి కొండమీదకు చేరుకుంటుందని పేర్కొన్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చి అమ్మవారి స్వామివారి ఆశీస్సులు అందుకోవాల్సిందిగా ఈవో పేర్కొన్నారు.

సుబ్బారాయుడికి వెండి మండపం బహుకరణ నేడు



మోపిదేవి, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ప్రముఖ పుణ్యక్షేత్రాలలో ఒకటిగా విరాజిల్లుతున్న మోపిదేవి సుబ్రహ్మణ్యేశ్వరస్వామి వారికి దాతలు ప్రత్యేకంగా తయారు చేసిన వెండి మండపాన్ని 4వ తేదీ గురువారం బహూకరించనున్నట్లు దాతలు తెలిపారు. హైదరాబాద్‌కు చెందిన ఆర్‌వి.ఆర్.చౌదరి - సౌభాగ్య లక్ష్మీ దంపతులు 48.895 కిలో గ్రాముల వెండిచే ప్రత్యేకంగా తయారు చేయించటం జరిగింది. రూ.1,01,53,742ల విలువ కలిగిన మండపంను స్వామివారిపై ఉన్న భక్తితో తయారు చేసి సమర్పిస్తున్నట్లు దాతలు తెలియజేశారు. గురువారం ఉదయం 8 గంటలకు స్వామివారికి కానుకగా వెండి మండపంను దేవస్థానం అధికారులకు బహూకరించటం జరుగుతుందని దాతలు తెలిపారు.



రుద్రవరం హెల్త్ సెంటర్‌ను సందర్శించిన ప్రపంచ ఆరోగ్య సంస్థ సభ్యులు

రోగులకు అందుతున్న సేవలపై ప్రపంచ ఆరోగ్య సంస్థ సభ్యుల పరిశీలన

మచిలీపట్నం టౌన్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : రోగులకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ద్వారా అందిస్తున్న సేవలు సక్రమంగా అందున్నదీ లేనిదీ బుధవారం ప్రపంచ ఆరోగ్య సంస్థ సభ్యులు పరిశీలించారు. చిన్నాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని రుద్రవరం హెల్త్ వెల్‌నెస్ సెంటర్, ఆర్ గొల్లపాలెం, 104 సర్వీసులను పరిశీలించారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ సభ్యులు డా. అభిషేక్, డా. రాధ, డా. బూష, డా. శ్రావన్, డా. అబ్దుల్ వాసి, డా. రాఘవేంద్ర, డా. సురేష్ ఈ పర్యటనలో పాల్గొన్నారు. రోగులకు బీపీ, షుగరు వ్యాధి గ్రస్తులకు అందుతున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. రోగులతో మాట్లాడారు. చిన్నాపురం పీహెచ్‌సీలో అందుతున్న వైద్యసేవల పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. వైద్యాధికారులు లాస్య, గాయత్రి, ఎంపిహెచ్‌ఈఓ పరమేశ్వరరావు, పిహెచ్‌ఎన్ మంగతాయారు, సూపర్‌వైజర్లు రాంబాబు, భారతి, రుద్రవరం హెల్త్ వెల్‌నెస్ సెంటర్ ఇన్‌చార్జి అమ్మాజీ, ఏఎన్ఎం నాగలక్ష్మిలు ప్రపంచ ఆరోగ్య సంస్థ సభ్యులతో పర్యటించారు.



బ్రహ్మయ్య మనుమడు జవహర్-నీరజ దంపతులను సత్కరిస్తున్న ఎమ్మెల్యే బుద్దప్రసాద్

మహనీయులు గొట్టిపాటి, మండలి వెంకట కృష్ణారావు

» ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్ర ప్రసాద్

ఘంటసాల, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : దివిసీమకు ఖ్యాతి తెచ్చిన మహనీయులు గొట్టిపాటి బ్రహ్మయ్య, మండలి వెంకట కృష్ణారావులని, వారి ఆశయాలు అనుసరణీయమని ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ అన్నారు. స్థానిక అన్నపూర్ణా సమేత విశ్వేశ్వరస్వామి వారి కళ్యాణ మండపంలో ఎమ్మెల్యే మండలి బుద్దప్రసాద్ ఆధ్వర్యంలో పద్మభూషణ్ గొట్టిపాటి బ్రహ్మయ్య 127వ జయంతి, మాజీమంత్రి మండలి వెంకట కృష్ణారావు శత జయంతి వేడుకలు బుధవారం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఎమ్మెల్సీ రాజేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ, గొట్టిపాటి బ్రహ్మయ్య జీవితం తెరచిన పుస్తకమని, స్వాతంత్ర్య ఉద్యమ పోరాటంలో ఈ ప్రాంతం నుంచి కీలక పాత్ర పోషించారని తెలిపారు. బ్రహ్మయ్య శిష్యునిగా మండలి వెంకట కృష్ణారావు విలువలు తెలిపిన రాజకీయ నాయకుడిగా గుర్తింపు తెచ్చుకుని దివిసీమకు ఆయన చేసిన సేవలు ఎనలేనివన్నారు. కృష్ణా మిల్క్ యూనిట్ చైర్మన్ చలసాని ఆంజనేయులు మాట్లాడుతూ, గొట్టిపాటి బ్రహ్మయ్య, మండలి వెంకట కృష్ణారావులు విద్యార్థి దశ నుండే సమాజానికి చేసిన సేవలు స్ఫూర్తిదాయకంగా నిలిచాయని తెలిపారు. ఎమ్మెల్యే మండలి బుద్దప్రసాద్ మాట్లాడుతూ, తన తండ్రి మండలి వెంకట కృష్ణారావుకు గొట్టిపాటి బ్రహ్మయ్య రాజకీయ గురువు అన్నారు. ఈ సందర్భంగా ఆస్టర్ రమేష్ హాస్పటల్ వారిచే ఏర్పాటు చేసిన ఉచిత వైద్యశిబిరానికి విశేష స్పందన లభించింది. తొలుత గొట్టిపాటి బ్రహ్మయ్య, మండలి వెంకట కృష్ణారావు చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. మహిళలు 25 మందికి చీరలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే తనయుడు మండలి వెంకట్రామ్, గొట్టిపాటి బ్రహ్మయ్య మనుమడు గొట్టిపాటి జవహర్ - నీరజ దంపతులు, ముని మనుమడు కొండపల్లి భాను ప్రసాద్-కళ్యాణి దంపతులు, ఏఎంసీ చైర్మన్ తోట కనకదుర్గ, జడ్పీ మాజీ ఉపాధ్యక్షులు గొర్రెపాటి వెంకట రామకృష్ణ, మాజీ ఏఎంసీ చైర్మన్ తుమ్మల చౌదరిబాబు, డీసీ చైర్మన్ అయినపూడి భాను ప్రకాష్, కృష్ణా మిల్క్ యూనియన్ డైరెక్టర్ వేమూరి సాయి వెంకటరమణ, స్వచ్ఛ ఘంటసాల కన్వీనర్ గొర్రెపాటి సురేష్, హాస్పటల్ సీనియర్ జనరల్ మేనేజర్ జ్యేష్ట రాజశేఖర్, కూటమి నేతలు, వైద్యులు తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్‌కు నివేదిక అందజేత

హనుమాన్‌జంక్షన్‌రూరల్: జవహర్ నవోదయలో జరిగిన ఘటనపై విద్యార్థి తండ్రితో మాట్లాడి తీసుకున్న వివరణతో కూడిన నివేదికను కలెక్టర్ డీకే బాలాజీకి బుధవారం అందజేసినట్టు ప్రిన్సిపాల్ డి ఏదునందన తెలిపారు. జవహర్ నవోదయ అవరణలో మంగళవారం నిర్వహించిన పీటీసీ(పేరెంట్స్, టీచర్స్ కమిటీ) సమావేశంలో విద్యార్థి తండ్రితో మాట్లాడిన అనంతరం అతడి వద్ద రాతపూర్వకంగా వివరణ తీసుకుని విద్యాలయ చైర్మన్, కలెక్టర్ బాలాజీకి అందజేసినట్టు వివరించారు. కార్యక్రమంలో పీటీసీ సభ్యులు ఆదినారాయణ, మోర్ల అంజనేయులు, కోట సురేష్ తదితరులు పాల్గొన్నారు.

సంస్కారవంతమైన రాజకీయాలు చేయాలి

» ప్రపంచంలోనే అగ్రగామి దేశాల సరసన భారత్

» 12 బహుళజాతి కంపెనీలకు సీఈవోలుగా మన సంతతికి చెందినవారు

» బూతులు మాట్లాడిన నేతలకు, పోలింగ్ బూత్‌ల్లో బుద్ధి చెప్పారు..

» మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు



జేష్ఠ కార్యకర్త జూపూడి హైమావతిని సత్కరిస్తున్న వెంకయ్య నాయుడు, చిత్రంలో మంత్రి సత్యకుమార్ యాదవ్ తదితరులు

కంకిపాడు, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : సంస్కారవంతమైన రాజకీయాలు చేయాలని, పార్టీలు ముఖ్యం కాదని దేశం, జాతీయ వాదమే ముఖ్యమని మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు అన్నారు. కృష్ణాజిల్లా కంకిపాడు మండలంలోని ఆయాన కన్వెన్షన్ సెంటర్‌లో బుధవారం నిర్వహించిన జనసంఘ్ జేష్ఠ కార్యకర్తల ఆత్మీయ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా వెంకయ్య మాట్లాడుతూ, దేశంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన తరువాత ప్రపంచంలోనే అగ్రగామి దేశాల సరసన భారత దేశం నిలిచిందన్నారు. 12 బహుళజాతి కంపెనీలకు సీఈవోలుగా మన సంతతికి చెందినవారు ఉండటమే అందుకు నిదర్శమన్నారు. దేశ ప్రధానిగా నరేంద్ర మోదీ బాధ్యతలు చేపట్టిన తరువాత దేశంలో అనేక సంస్కరణలు, మార్పులు తీసుకువచ్చారన్నారు. ఒక్క రక్తం బొట్టు కూడా నేల మీద పడకుండా అయోధ్య రామ మందిరం నిర్మించామన్నారు. ఆర్టికల్ 371ను రద్దు చేశామన్నారు. త్రిపుల్ తలాక్‌ను రద్దు చేశారన్నారు. నక్సలిజాన్ని రూపుమాపేందుకు విశేషంగా కృషిచేస్తున్నారని తెలియజేశారు. దేశంలో ఉగ్రవాద దాడులు, ఉగ్రవాదం తగ్గిందన్నారు. పాకిస్థాన్ మాత్రం నిరుత్సాహం, నిస్పృహల్లో ఉంటూ పహల్గాం వంటి దాడులకు పాల్పడుతుందన్నారు. అటువంటి పాకిస్తాన్‌కు సిందూర్‌తో తిరిగి సమాధానం చెప్పడం జరిగిందని తెలియజేశారు. రాజకీయాల్లో వ్యక్తులు, పార్టీలు ముఖ్యం కాదన్నారు. జాతీయ వాదం, దేశమే ప్రధానమని తెలియజేశారు. తాను పదవులకు రాజీనామా చేశానని, పెదవులకు కాదన్నారు. రాజకీయాల్లో వారసత్వం కాదని, జవసత్వం కావాలన్నారు. రాజకీయాల్లో బూతులు మాట్లాడిన నాయకులకు ప్రజలు పోలింగ్ బూతుల్లో బుద్ధి చెప్పారని పరోక్షంగా వైసీపీని ఉద్దేశించి ఆయన అన్నారు. బీహార్ ఎన్నికల్లో ఓట్లు చోరీ అంటూ నానా యాగి చేసిన కాంగ్రెస్ ఓటమితో తోక ముడిచిందన్నారు. మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ మాట్లాడుతూ, గతంలో బీజేపీ అధికారంలోకి వస్తుందా అంటూ అనేకమంది హేళన చేశారన్నారు. దేశంలో 14 రాష్ట్రాల్లో అధికారంలో ఉన్నామని గుర్తు చేశారు. 2 పార్లమెంట్ స్థానాల్లో ప్రస్తుతం 248 మంది పార్లమెంట్ స్థానాల్లో అగ్రస్థానంలో నిలిచామని గుర్తు చేశారు. రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో జేష్ఠ కార్యకర్తలను ఘనంగా సత్కరించారు. వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్, బీజేపీ పూర్వ రాష్ట్ర సంఘటన ప్రధాన కార్యదర్శి పి.వేణుగోపాల రెడ్డి, సామాజిక సమరసత వేదిక జాతీయ కన్వీనర్ కె.శ్యామ్‌ప్రసాద్, కృష్ణాజిల్లా అధ్యక్షులు తాతినేని శ్రీరామ్, వివిధ జిల్లా అధ్యక్షులు, ఉపాధ్యక్షులు పాల్గొన్నారు.

ఉత్తరాంధ్ర జిల్లా అధ్యక్షుడికి తీవ్రగాయాలు

జేష్ఠ కార్యకర్తల ఆత్మీయ సమావేశంలో ప్రసంగించి వెళుతున్న ఉత్తరాంధ్ర జిల్లా అధ్యక్షుడు ప్రకాష్ రెడ్డి కాలుజారి స్టేజ్ పైనుంచి కింద పడిపోయారు. దీంతో ప్రకాష్ రెడ్డికి తీవ్రగాయాలు కాగా హుటాహుటిన ఆసుపత్రికి తరలించారు.

రైతుల ఆదాయం పెంపుతోనే రాష్ట్రం సుభిక్షం

» మంత్రి కొల్లు రవీంద్ర



సభలో మాట్లాడుతున్న మంత్రి కొల్లు రవీంద్ర

మచిలీపట్నం టౌన్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : రైతే దేశానికి వెన్నెముక అని, రైతుల ఆదాయం పెంపుతోనే రాష్ట్రం సుభిక్షంగా ఉంటుందని మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. 'రైతన్నా నీ కోసం' కార్యక్రమంలో భాగంగా బందరు మండలం గుండుపాలెంలో జరిగిన కార్యక్రమంలో బుధవారం రవీంద్ర పాల్గొన్నారు. తొలుత ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పాదయాత్రగా వెళ్లి రైతు భరోసా కేంద్రాన్ని పరిశీలించారు. రైతులకు అందిస్తున్న పథకాల గురించి, రైతుల సమస్యల గురించి అధికారులతో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం రైతుల కోసం అమలు చేస్తున్న పథకాల గురించి రైతులను చైతన్యపరచడం ద్వారా రైతు సేవా కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. ఇంటింటికీ ఒక పారిశ్రామికవేత్త నినాదం మేరకు తమ పిల్లలను రైతులు ప్రోత్సహించాలన్నారు. నీటి సంఘం అధ్యక్షుడు తూమాటి వెంకయ్యతో సాగునీటిపై చర్చలు జరిపారు. డిసిఎంఎస్ చైర్మన్ బండి రామకృష్ణ మాట్లాడుతూ, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్‌ల నేతృత్వంలో రైతులకు ఏ కష్టం వచ్చినా ఆదుకుంటున్నారన్నారు. కార్యక్రమంలో గొర్రెపాటి గోపీచంద్, రూరల్ మండల అధ్యక్షుడు కాగిత వెంకటేశ్వరరావు, మార్కెట్ యార్డు చైర్మన్ కుంచే నాని, తెలుగు రైతు జిల్లా అధ్యక్షుడు గోపు సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయం ఆరోగ్యదాయకం

» క్షేత్రస్థాయిలో సాగు విధానం పరిశీలించిన కో-ఇంపాక్ట్ ఆసియా రీజనల్ డైరెక్టర్ శగున్ సబర్వాల్



వైకుంఠ లక్ష్మీపురంలో ప్రకృతి వరిపంట, గట్లపై అంతరపంట సాగును పరిశీలిస్తున్న కో-ఇంపాక్ట్ ఆసియా రీజనల్ డైరెక్టర్ శగున్ సబర్వాల్

హనుమాన్‌జంక్షన్‌రూరల్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : సహజ ఎరువులను ఉపయోగించడం ద్వారా ప్రకృతి వ్యవసాయం చేయడం వల్ల పర్యావరణ హితంతో పాటు ఆరోగ్యదాయకమని కో-ఇంపాక్ట్ ఆసియా రీజనల్ డైరెక్టర్ శగున్ సబర్వాల్ అన్నారు. కానుమోలు, వైకుంఠలక్ష్మీపురం గ్రామాల్లో ప్రకృతి వ్యవసాయం, సేంద్రీయ పద్ధతులు తదితర విషయాలపై జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ పార్థసారధి ఇతర అధికారులతో కలిసి బుధవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ప్రకృతి వ్యవసాయ తొమ్మిది సూత్రాల చక్రాన్ని పరిశీలించి వాటి ప్రాముఖ్యతను అడిగి తెలుసుకున్నారు. ప్రకృతి వ్యవసాయంలో వాడే జీవామృతం, బీజామృతం తయారీని డీపీఎం పార్థసారధి సోదాహరణంగా చూపించారు. కానుమోలులో అనురాధ నిర్వహిస్తున్న 365రోజుల కిచెన్ గార్డెన్, ఏటీఎం మోడల్‌ను పరిశీలించి కుటుంబానికి పోషకాహారం, ఆరోగ్యాన్నిచ్చే విధంగా కృషి చేయడాన్ని అభినందించారు. వైకుంఠలక్ష్మీపురంలో అట్లూరి బాల సత్యనారాయణ సాగు చేస్తున్న ప్రకృతి వ్యవసాయ విధానాన్ని చేల గట్లపై కలుపు పెరగకుండా అంతరపంటలుగా సాగు చేస్తున్న అల్లం, పసుపు పంటలను పరిశీలించారు. దేశీయ విత్తనాల ప్రాముఖ్యత వాటి ఆరోగ్యలాభాల గురించి రైతును అడిగితెలుసుకున్నారు. ఎస్‌హెచ్‌జీ మహిళలతో ముఖాముఖి నిర్వహించారు. ప్రకృతి సాగు, ఏటీఎం ద్వారా పొందిన ప్రయోజనాలను మహిళలు వివరించగా వారిని అభినందించారు. కార్యక్రమంలో డీపీఎం మల్లేశ్వరి, శ్రావణి, సౌమ్య, వర్ష వర్ధన, డ్వాక్రా గ్రూప్ మహిళలు, రైతులు పాల్గొన్నారు.

మడ విధ్వంసం!

(5వ పేజీ తరువాయి)

వేసి చర్యలు చేపట్టకపోతే భవిష్యత్తులో తగిన మూల్యం చెల్లించుకోక తప్పదు.

క్రయవిక్రయాలు

పెదపట్నం పార్వతీపురం రోడ్డు వెంబడి 100 ఎకరాల విస్తీర్ణంలో మడ చెట్లను నరికి అక్రమార్కులు ప్లాట్లుగా వేశారు. వాటిని వేరొకరికి విక్రయించారు. వీటిని కొనుగోలు చేసిన వారు రెవెన్యూ శాఖ సహకారంతో పట్టాలు పుట్టించుకున్నారు. రెవెన్యూ రికార్డుల్లో కూడా ఎక్కాయి. ఆ తర్వాత ప్రొక్లెయిన్లను తీసుకువచ్చి రొయ్యల చెరువులు తవ్వించారు. లజ్జబండ డ్రెయిన్ నుంచి చెరువుల్లోకి నీటిని మళ్లించి రొయ్యల సాగు చేస్తున్నారు. ఇదే సందర్భంలో పెదపట్నం వంతెనకు రెండు వైపులా 500 ఎకరాలకు పైబడి మడ చెట్లను అక్రమార్కులు నరికివేసి రొయ్యల చెరువులుగా మార్చారు. దళితవాడ నుంచి దిగువ సముద్రం వైపు వెళ్లే డొంక రోడ్డుకు రెండు వైపులా 250 ఎకరాల మడ అటవీ విస్తీర్ణం ఆక్రమణకు గురైంది. గొల్లగూడెం నుంచి సముద్రానికి వెళ్లే వైపు రోడ్డు వెంబడి ఉన్న మడ అడవి, సముద్రం వెంబడి ఉన్న మడ అడవిలో మొత్తం 400 ఎకరాలను ఆక్రమించి మడచెట్లను నరికివేశారు. సముద్రం పక్కనే ఉన్న పార్వతీపురం గ్రామంలో 150 ఎకరాలు కూడా ఆక్రమణలకు గురైంది. పాండ్రాక పంచాయతీ పరిధిలోని రామాపురంలో 40 ఎకరాలు, ఉప్పులూరులో 70 ఎకరాలు, రామానగర్‌లో 100 ఎకరాలకుపైగా మడచెట్లను నరికేశారు. లజ్జబండ డ్రెయిన్ బండ్‌ను ఆక్రమించి 200 ఎకరాల మేర మడచెట్ల నరికివేత జరిగింది. ఇవన్నీ కూడా రొయ్యల చెరువులుగా మారిపోయాయి.

పీఏసీఎస్‌ల్లో రూ.కోట్లలోనే అవినీతి!

(5వ పేజీ తరువాయి)

శాఖాధికారితో మాట్లాడారు. దీనిపై డివిజనల్ అధికారి రామును విచారించమని ఆదేశాలు జారీ చేశారు. దీంతో అవనిగడ్డకు చెందిన అసిస్టెంట్ రిజిస్ట్రార్ నాగమల్లేశ్వరరావు విచారణ ప్రారంభించారు. ఐదేళ్ల పాటు జరిగిన అవినీతి అక్రమాలపై విచారణ జరుపుతున్నారు. ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘంలోని 205 మంది సభ్యులను విచారించారు. ఈ విచారణలో దాదాపు రూ. 6 కోట్ల వరకు అవినీతి జరిగినట్టు తెలుస్తోంది. విచారణ తుది నివేదికను విచారణాధికారి నాగమల్లేశ్వరరావు ఇచ్చేందుకు సన్నద్ధం చేస్తున్నారు.

ఇప్పటికే ముగ్గురు కార్యదర్శులపై వేటు

అవినీతి అక్రమాలకు పాల్పడిన గోకవరం కార్యదర్శి మట్టా భాస్కరబాబు, శివగంగ కార్యదర్శి పి.రాజేష్, తరకటూరు కార్యదర్శి శ్రీనివాసరావును సస్పెండ్ చేశారు. తరకటూరు పీఏసీఎస్‌లో రైతులు చెల్లించిన లక్షలాది రూపాయలు జమ కాలేదని తెలియడంతో అక్కడ విచారణ జరుపుతున్నారు. గుడివాడ సొసైటీలో ఇలాగే కోట్లాది రూపాయల అక్రమాలు జరిగినట్టు ఫిర్యాదులు అందాయి. అవనిగడ్డ కొత్తపేటలోని శ్రీరామ పీఏసీఎస్‌లో రుణాల సొమ్మును పెద్ద మొత్తంలో స్వాహా చేశారు. సొసైటీ కార్యదర్శి విఠల్ రావు సస్పెన్షన్ అనంతరం అనారోగ్యంతో మృతి చెందాడు. ఇలా తవ్విన కొద్దీ అక్రమాలు బయటపడుతూనే ఉన్నాయి.

గోకవరం కార్యదర్శి ఆస్తులపై ఆంక్షలు



గోకవరం సహకార సంఘ కార్యదర్శి మట్టా భాస్కరబాబు ఆస్తులపై సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఆంక్షలు విధించాం. సొసైటీలోని అక్రమాలపై వారం రోజుల్లో విచారణ పూర్తవుతుంది. శివగంగ సొసైటీ విచారణ మరో మూడు నెలలు పడుతుంది.

– చంద్రశేఖరరెడ్డి, జిల్లా సహకార శాఖాధికారి

వినియోగదారుడి సొమ్మును వడ్డీతో చెల్లించండి

» సహారా ఇండియాకు లోక్ అదాలత్ చైర్మన్ ఆదేశం

మచిలీపట్నం టౌన్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : సహారా ఇండియాలో స్కీమ్ ద్వారా 20 నెలలు డిపాజిట్ చేసిన రూ. 52వేలను 6 శాతం వడ్డీతో, రూ. 2వేలు కోర్టు ఖర్చులు సహా చెల్లించాలని మచిలీపట్నం సహారా ఇండియా బ్రాంచ్ మేనేజర్‌ను ఆదేశిస్తూ కృష్ణాజిల్లా పర్మినెంట్ లోక్ అదాలత్ చైర్మన్ ఓ.నరసింహారావు బుధవారం తీర్పు ఇచ్చారు. మచిలీపట్నం గోపాల్‌నగర్‌కు చెందిన షేక్ సలీం 2019 ఏప్రిల్ 15న సహారా ఇండియా సంస్థ ద్వారా 20 వాయిదాలతో రూ. 52వేలు చెల్లించారు. స్కీమ్ పూర్తయిన తరువాత వినియోగదారుడికి డబ్బు ఇవ్వలేదు. వినియోగదారుడు లీగల్ నోటీసు పంపినా సహారా ఇండియా అధికారులు స్పందించలేదు. దీంతో జిల్లా పర్మినెంట్ లోక్ అదాలత్‌లో న్యాయవాది బాలాజీ కేసు దాఖలు చేశారు. వడ్డీతో చెల్లించాలని లోక్ అదాలత్ తీర్పు ఇచ్చింది.

వీధిదీపాల ఆన్,ఆఫ్‌పై అవగాహన

» అప్లికేషన్‌ను ప్రారంభించిన సీపీడీసీఎల్ సీఎండీ పుల్లారెడ్డి

విజయవాడ, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): నగరంలో స్మార్ట్‌మీటర్లను అన్ని స్ట్రీట్ లైట్లకు బిగించడానికి సీపీడీసీఎల్ సన్నద్ధమైంది. ఈ సందర్భంగా విద్యుత్ సౌధలో బుధవారం వీధి దీపాలను ఆన్, ఆఫ్ ఎలా చేయాలనే దానిపై అవగాహన కార్యక్రమం ఏర్పాటుచేశారు. ఈ కార్యక్రమంలో సీపీడీసీఎల్ సీఎండీ పుల్లారెడ్డి పాల్గొని స్ట్రీట్‌లైట్ ఆన్, ఆఫ్ చేయడానికి సంబంధించిన అప్లికేషన్‌ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డైరెక్టరు టెక్నికల్ మురళీ కృష్ణ యాదవ్, ప్రాజెక్ట్ డైరెక్టర్ టీవీఎస్ఎన్ మూర్తి, జీఎం ఐటీ యోగానంద, విజయవాడ ఎస్ఈ హనుమయ్య, గుణదల ఈఈ పరిమి హరిబాబు, ఐటీ ఈఈ సుధాకర్ పాల్గొన్నారు.

దివ్యాంగ ఉద్యోగుల సమస్యలు పరిష్కరిస్తాం

» ఏడీఆర్ఎం పిఈఎడ్విన్

రైల్వేస్టేషన్ : విజయవాడ రైల్వే డివిజన్‌లో విధులు నిర్వహించే దివ్యాంగ ఉద్యోగుల సమస్యలను తమ దృష్టికి తీసుకువస్తే తక్షణమే పరిష్కరిస్తామని డివిజన్ ఏడీఆర్ఎం పి.ఈ.ఎడ్విన్ తెలిపారు. అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం దక్షిణ మధ్య రైల్వే దివ్యాంగ ఉద్యోగ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఎడ్విన్ మాట్లాడుతూ, దివ్యాంగ ఉద్యోగులకు ప్రత్యేక సదుపాయాలు ఉన్నట్టు తెలిపారు. వారికి ఏమైనా సమస్యలు ఉంటే తనను నేరుగా సంప్రదించాలన్నారు.



రైల్వేస్టేషన్ నుంచి ధర్నాచౌక్‌కు అగ్రి బాధితుల యాత్ర

అగ్రిగోల్డ్ బాధితుల ఆవేదన దీక్ష

ధర్నాచౌక్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో ప్రభుత్వాలు మారినా తమ తలరాతలు మారడం లేదని 'అగ్రిగోల్డ్' బాధితులు వాపోయారు. అగ్రిగోల్డ్ కస్టమర్స్ అండ్ ఏజెంట్స్ వెల్ఫేర్ అసోయేషన్ ఆధ్వర్యంలో స్థానిక ధర్నాచౌక్‌లో 'అగ్రిగోల్డ్ బాధితుల ఆవేదన దీక్ష' బుధవారం జరిగింది. తొలుత రైల్వేస్టేషన్ నుంచి ధర్నాచౌక్ వరకు యాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ముప్పాళ్ల నాగేశ్వరరావు మాట్లాడుతూ, అగ్రిగోల్డ్ బాధితులతో సీఎం చంద్రబాబు సమావేశం నిర్వహించి వారికి సత్వరమే న్యాయంచేయాలని డిమాండ్ చేశారు. ఇప్పటి వరకు 600మంది బాధితులు ఆత్మహత్యలకు పాల్పడ్డారని అధికారికలెక్కలు న్నాయన్నారు. కంపెనీ ఆస్తులు ఎటాచ్‌లో ఉన్నప్పటికీ ప్రభుత్వం బాధితుల మొర ఆలకించడంలేదన్నారు. పలువురు వక్తలు మాట్లాడుతూ అగ్రిగోల్డ్ కేసుల సత్వర పరిష్కారానికి ప్రత్యేక ఫాస్ట్‌ట్రాక్ కోర్టును విజయవాడ కేంద్రంగా ఏర్పాటుచేయాలని డిమాండ్ చేశారు. సంఘం నేతలు, అధిక సంఖ్యలో బాధితులు పాల్గొన్నారు.

డిపాజిట్‌దారుల నుంచి ప్రాణహాని ఉంది

– యాదగిరి, బెల్లంకొండ (పల్నాడు జిల్లా)

మాది సంచార జాతి.. మావాళ్ల ఊరూరు తిరిగి భిక్షాటన చేసి కంపెనీలో డిపాజిట్ చేశారు. సుమారు రూ.20 లక్షల వరకు పలువురి నుంచి డిపాజిట్ చేశారు. సంస్థకు ఆస్తులున్నాయని, మీ డబ్బులు ఎక్కడికీ పోవని వారితో డబ్బులు కట్టించాను. డబ్బులు చెల్లించకపోవడంతో నాపై తీవ్ర ఒత్తిడి చేస్తున్నారు. ప్రాణహాని ఉంది. ప్రభుత్వం ఆదుకోవాలి.

అప్పులతో పిల్లల పెళ్లిళ్లు చేసి రోడ్డునపడ్డాం

– ఆగస్టీన్, పెదకాకాని (గుంటూరు)

అగ్రిగోల్డ్ సంస్థలో 70 సెంట్ల పొలం రిజిస్ట్రేషన్ అయి ఉంది. అది సీఐడీ అటాచ్‌మెంట్‌లో ఉందని చెబుతున్నారు. అదే విధంగా హైదరాబాద్‌లో ఒక ప్లాట్‌కు సగం డబ్బులు చొప్పున 12మంది కట్టాము. వాటిని తెలంగాణ ప్రభుత్వం ఆక్రమించుకుందని చెబుతున్నారు. పిల్లలకు అప్పులుచేసి పెళ్లిళ్ల చేశాం. ప్రస్తుతం రోడ్డునపడ్డాం. కూటమి ప్రభుత్వం ఆదుకోవాలి.

సీఎం చంద్రబాబుపై నమ్మకం ఉంది

– మల్లిక, రాజంపేట (కడప జిల్లా)

నా భర్త చనిపోయారు. పిల్లల చదువు, ఇల్లు గడవడం కష్టంగా ఉంది. గతంలో అగ్రిగోల్డ్ బాధితులకు చంద్రబాబు కొందరికి న్యాయం చేశారు. జగన్ ఏమీ చేయలేదు అందుకనే ఈసారి చంద్రబాబుకు ఓట్లు వేశాం. ప్రజలకు బాగా మంచి పనులు చేస్తున్నారు. మామీద కూడా దయచూపి ఆదుకోవాలి.

కంపెనీ ఆస్తులు స్వాధీనం చేసుకుని డబ్బులు చెల్లించండి

– ప్రసన్నకుమారి చల్లపల్లి

అగ్రిగోల్డ్ ఆస్తులను ప్రభుత్వం స్వాధీనం చేసుకుని డిపాజిట్ దార్లకు చెల్లించాలి. కంపెనీ మీద నమ్మకంతో డిపాజిట్‌లు సేకరించాం. తిరిగి వారికి డబ్బులు చెల్లించపోవడంతో మాటలు పడలేకపోతున్నాం. చంద్రబాబు న్యాయం చేయాలని కోరుతున్నాం.



హైలైఫ్ వజ్రాభరణాల ప్రదర్శన..

విజయవాడ నగరంలోని నోవాటెల్ హోటల్‌లో హైలైఫ్ జ్యూయల్స్ ఆభరణాల ప్రదర్శన ఈ నెల 5, 6, 7 తేదీల్లో నిర్వహించనున్నట్టు షోరూం నిర్వాహకులు తెలిపారు. ప్రదర్శనలో మహిళలకు నచ్చేలా ఆకర్షణీయమైన అత్యున్నత ప్రమాణాలతో ఆభరణాలు అందుబాటులో ఉంటాయన్నారు. - విజయవాడ సిటీ

అడ్డంకులెన్నో..!

(5వ పేజీ తరువాయి)

ఈ రహదారిని అభివృద్ధి చేసేందుకు నమూనాను రూపొందించారు. ఈ ప్రతిపాదనతో మచిలీపట్నం నగరానికి వాయు కాలుష్యంతో పాటు ట్రాఫిక్ ఇబ్బందులు ఎదురవుతాయి.

- మచిలీపట్నం నగరం అభివృద్ధికి ఈ రహదారి విస్తరణ అడ్డంకిగా మారుతుంది. ఇప్పటికే మచిలీపట్నం-విజయవాడ జాతీయ రహదారి అభివృద్ధి కోసం రెండు విడతలుగా భూమిని సేకరించారు. మళ్లీ మూడో సారి భూమిని సేకరించడం రైతులను తీవ్ర ఇబ్బందుల పాలుజేయడమే.
- ప్రస్తుతం ఎస్.ఎన్.గొల్లపాలెం వద్ద ఎకరం భూమి రిజిస్ట్రార్ కార్యాలయంలో రూ.80 లక్షలుగా ఉంది. బహిరంగ మార్కెట్‌లో ఎకరం భూమి రూ.10 కోట్ల వరకు ధర పలుకుతోంది. ఇంతటి విలువైన భూమిని ఇప్పటికే రెండు సార్లుగా ఇచ్చామనీ, మరో విడత ఇచ్చేందుకు సిద్ధంగా లేమంటూ న్యాయవాదుల సలహాలు తీసుకుని రెండు విడతలుగా కలెక్టర్ బాలాజీని కలిసి వినతిపత్రాలు అందజేశారు.

విభిన్న ప్రతిభకు ప్రోత్సాహం

(5వ పేజీ తరువాయి)

ప్రాంతంలో ప్రాక్టీస్ చేసి ప్రపంచ క్రీడా వేదికపై సత్తా చాటిన ఆమెను ప్రత్యేకంగా ప్రశంసించారు. ఆమెతో పాటు మరో క్రీడాకారిణి దీపిక, అర్జున అవార్డు గ్రహీత అజయ్‌కుమార్‌రెడ్డికి ప్రభుత్వ నజరానాను సీఎం ప్రకటించారు. దివ్యాంగులకు రాష్ట్ర ప్రభుత్వం ఎప్పుడు అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. దివ్యాంగుల్లో పట్టుదల ఎక్కువగా ఉంటుందని, కొంచెం సపోర్ట్ చేస్తే అద్భుతాలు సృష్టిస్తారని తెలిపారు. అనంతరం పలువురు దివ్యాంగులు ఇచ్చిన వినతులను సీఎం స్వయంగా స్వీకరించారు. తన వద్దకు వచ్చే దివ్యాంగులను ఇబ్బంది పెట్టొద్దని పోలీసులను హెచ్చరించారు. చివరికి పెండ్యాల గాయత్రి రచించిన దివ్య పాదం పుస్తకాన్ని మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామి ఆవిష్కరించారు. సెంట్రల్ ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే గద్దె రామ్మోహనరావు, ప్రిన్సిపల్ సెక్రటరీ అజయ్‌జైన్, ప్రభుత్వ కార్యదర్శి సూర్యకుమారి, ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ జి.లక్ష్మీశ, పలు కార్పొరేషన్‌ల చైర్మన్‌లు పాల్గొన్నారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి (రూ.లలో)

బ్రాయిలర్‌బర్డ్	144, 153, 164
చికెన్ విత్ స్కిన్	274
చికెన్ స్కిన్‌లెస్	284



నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 665

బాపులపాడు పంచాయతీలో ఐఎస్‌వో తనిఖీ

హనుమాన్‌జంక్షన్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): బాపులపాడు పంచాయతీని బుధవారం ఐఎస్‌వో సంస్థ ఆడిటర్ ఆలపాటి శివయ్య డీఎల్పీవో సంపత్‌కుమారి ఆధ్వర్యంలో పరిశీలించారు. అంగన్వాడీ, డ్వాక్రా సంఘాలు, ఆశా వర్కర్లు, వైద్య సిబ్బంది, శానిటరీ వర్కర్లు, సచివాలయ సిబ్బంది పని తీరుపై ఐఎస్‌వో ప్రమాణాలకు అనుగుణంగా వివరాలు సేకరించారు. శానిటరీ వర్కర్ల పనితీరుపై అభ్యంతరం వ్యక్తం చేశారు. తప్పనిసరిగా చేతి గ్లౌజులు వినియోగించాలని సిబ్బందికి సూచించారు. చెత్త సేకరణకు ఏర్పాటు చేసిన స్వచ్ఛరథం వాహనాన్ని పరిశీలించి అభినందించారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ ఇన్‌చార్జి కార్యదర్శి అంజన, వేలేరు గ్రామ పంచాయతీ కార్యదర్శి సురేష్, మూడు సచివాలయాల సిబ్బంది పాల్గొన్నారు.

స్వమిత్వ సర్వేను పగడ్బందీగా నిర్వహించండి

కలెక్టర్ బాలాజీ



స్వమిత్వ సర్వే వివరాలు తెలుసుకుంటున్న కలెక్టర్ బాలాజీ

గన్నవరం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో స్వమిత్వ సర్వేను పగడ్బందీగా చేపట్టాలని కలెక్టర్ డీకే బాలాజీ అధికారులను ఆదేశించారు. జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్‌తో కలిసి బుధవారం తహసీల్దారు కార్యాలయం నుంచి సర్వేయర్లు, ఆర్ఎస్, డిప్యూటీ తహసీల్దా రులతో సర్వే పురోగతిపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి మాట్లాడారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామాల్లో జరుగుతున్న సర్వేను ఎలాంటి పొరపాట్లకు తావివ్వకుండా జాగ్రత్తగా నిర్వ హించాలన్నారు. ప్రతి ఇంటితో పాటు ఖాళీ స్థలాలకు కూడా పర్సన్ ప్రాపర్టీ నెంబర్ (పీపీఎన్) కేటాయించాల్సిందేనన్నారు. తహసీ ల్దారు కేవీ శివయ్య, ఎంపీడీవో స్వర్ణలత, సర్వేయర్లు తదితరులు ఉన్నారు.

తహసీల్దారు కార్యాలయంలో కలెక్టర్ తనిఖీ

తహసీల్దారుకార్యాలయాన్ని కలెక్టర్ బాలాజీ బుధవారం సందర్శించి రిజిస్టర్లు, రికార్డులను తనిఖీ చేశారు. నెలవారి నివేది కలు, పలు సర్వేల పురోగతి, ఖాళీ పోస్టులు వివరాలను తహసీల్దారును అడిగి తెలుసుకు న్నారు.

ప్రకృతి వ్యవసాయం వైపు మరలాలి

ఉయ్యూరు: ప్రకృతి వ్యవసాయం వైపు రైతులు మొగ్గుచూపాలని కలెక్టర్ డీకే బాలాజీ సూచించారు. సీఎం చంద్రబాబు నల్లజర్లలో నిర్వహించిన రైతన్నా మీకోసం కార్యక్రమాన్ని గండిగుంట రైతు సేవాకేంద్రం-2లో కలెక్టర్ వర్చువల్‌గా పాల్గొన్నారు. అనంతరం మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయాన్ని ప్రభుత్వం ప్రోత్సాహిస్తుందన్నారు. రైతులకు అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు. గండిగుంట రైతులు చిట్టినేని సతీశ్‌కుమార్, పాలడుగు సతీశ్‌కుమార్, క్రాంతికుమార్ ఆధునిక వ్యవసాయ పద్ధతులు, ఆకునూరుకు చెందిన మాగంటి కిరణ్ ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో సాగుచేస్తున్న వరి, మినుము పంటల సాగుకు సంబంధించిన అనుభవాలను కలెక్టర్‌కు వివరించారు. ఆర్డీవో హేలాషారోన్, తహసీల్దార్ సురేశ్‌కుమార్, వ్యవసాయ అధికారి నిస్సీగ్రేస్, పశుసంవర్ధక శాఖ ఏడీ రామ్‌శేఖర్, వెటర్నరీ డాక్టర్ శ్రీకాంత్ పాల్గొన్నారు.

అంబాపురంలో అభివృద్ధి పనులు



వాటర్ ట్యాంక్ నిర్మాణ పనులకు భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు

విజయవాడ రూరల్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : గన్నవరం నియోజకవర్గంలో అరాచక పాలన అంతమై అభివృద్ధి పాలన సాగుతోందని ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు అన్నారు. విజయవాడ రూరల్ మండలం అంబాపురం గ్రామంలో పలు అభివృద్ధి పనులకు భూమిపూజా కార్యక్రమాలు బుధవారం జరిగాయి. ఈ కార్యక్రమాలకు ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే యార్లగడ్డ శంకుస్థాపన చేసి అభివృద్ధి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పైపులరోడ్డు ప్రాంతంలోని అంబాపురం పంచాయతీలో 1.28 లక్షల సామర్థ్యం గల మంచినీటి ట్యాంక్ నిర్మాణం చేపట్టినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ గూడవల్లి నరసింహారావు, సర్పంచ్ గండికోట సీతయ్య, టీడీపీ నేతలు తదితరులు పాల్గొన్నారు.

రాజు మృతి బాధాకరం : ఎమ్మెల్యే

గన్నవరం: టీడీపీ అభివృద్ధి కోసం అంకితభావంతో పనిచేస్తున్న రాజు ఆకస్మిక మృతి బాధాకరమని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే వెంకట్రావు విచారం వ్యక్తం చేశారు. మండలంలోని చిన అవుటపల్లి గ్రామానికి చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు చల్లా రాజు (45) మంగళవారం రాత్రి జరిగిన ప్రమాదంలో మృతి చెందాడు. రాజు మృతి వార్త తెలుసుకున్న ఎమ్మెల్యే యార్లగడ్డ బుధవారం రాజు మృతదేహాన్ని సందర్శించి, పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన భౌతిక కాయంపై టీడీపీ జెండా కప్పారు. మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఏఎంసీ చైర్మన్ గూడవల్లి నరసింహారావు, మండల అధ్యక్షుడు గూడపాటి తులసి మోహన్, తదితరులు రాజు మృతదేహానికి నివాళులర్పించారు.



పెదపులిపాకలో రైతులకు భూసార కిట్లను అందజేస్తున్న ఎమ్మెల్యే బోడె ప్రసాద్



రంగన్నగూడెంలో ఉద్యానశాఖ అధికారి జ్యోతి, ఏవో రంగనాథ్‌బాబు, ఆళ్ల గోపాలకృష్ణ తదితరులు



పెదఅవుటపల్లిలో మాట్లాడుతున్న వ్యవసాయశాఖ అడిషనల్ డైరెక్టర్ విజయలక్ష్మి

రైతును రాజు చేయడమే ప్రభుత్వ ధ్యేయం

రైతన్నా... మీకోసంలో ఎమ్మెల్యే బోడె ప్రసాద్

పెనమలూరు, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): రైతును రాజుగా చేయాలన్న సీఎం చంద్రబాబు ఆలోచన సాకారం చేసేలా అన్నదాతకు ప్రభుత్వం తోడుగా ఉంటుందని ఎమ్మెల్యే బోడె ప్రసాద్ అన్నారు. బుధ వారం పెదపులిపాకలో జరిగిన రైతన్నా... మీకోసంలో ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. భూమిలో పోషకాలు పెంచేలా అన్నదాతకు వ్యవసాయశాఖ తగు సూచనలు చేస్తున్నదని, మెరుగైన దిగుబడి సాధిం చేందుకు రైతులకు వెన్నుదన్నుగా ఉంటామని స్పష్టం చేశారు. రైతులతో ఎమ్మెల్యే ముఖాముఖిలో పాల్గొని వారికి భూసారానికి సంబంధించిన పోష కాల కిట్లను అందించారు. సర్పంచ్ గుంటూరు శ్రీనివాసచౌదరి, టీడీపీ మండల అధ్యక్షుడు కోయ ఆనంద్‌ప్రసాద్, గ్రామ అధ్యక్షుడు దాసరి హరినీ డు, ఏవో శైలజ, ఉద్యానశాఖ అధికారి హరిచంద్ర తదితరులు పాల్గొన్నారు.

రంగన్నగూడెంలో...

హనుమాన్‌జంక్షన్‌రూరల్: రంగన్నగూడెంలో నిర్వహించిన రైతన్నా మీకోసంలో ఉద్యానవనశాఖ అధికారి జె.జ్యోతి ప్రభుత్వ ప్రణాళికను వివరించారు. వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకు ప్రభుత్వం కృషి చేస్తున్నదని ఎన్ఎస్ఎల్పీ ప్రాజెక్ట్ కమిటీ వైస్ చైర్మన్ ఆళ్ల గోపాలకృష్ణ అన్నారు. కార్యక్రమంలో ఏవో రంగనాథ్‌బాబు, హెచ్‌వో జోసఫ్‌సుందరం, సర్పంచ్ రంగామణి, ఎంపీటీసీ సభ్యుడు లక్ష్మీనారాయణ, పీఏసీఎస్ చైర్ పర్సన్ కనకవల్లి శేషగిరిరావు, టీడీపీ అధ్యక్షుడు పల్లగాని వీరాంజనేయులు, రైతులు పాల్గొన్నారు.

పెదఅవుటపల్లిలో..

ఉంగుటూరు: పెదఅవుటపల్లిలోని రైతుసేవా కేంద్రం(ఆర్ఎస్‌కే)లో రాష్ట్ర వ్యవసాయశాఖ అడిషనల్ డైరెక్టర్ వీవీ విజయలక్ష్మి మాట్లాడుతూ రైతులు సంప్రదాయ సాగు పద్ధతులకు స్వస్తిపలికి, ఆధునిక సాంకేతిక సాగు విధానాలను అవలంబించాలన్నారు. ముఖ్యంగా వాణిజ్య పంటల సాగువైపు రైతులు దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో గన్నవరం ఏడీఏ ఎం.సునీల్, ఏవో గద్దె రమేష్, ఏఎంసీ వైస్‌చైర్మన్ కొండేటి వెంకటేశ్వరరావు, గన్నవరం, ఆత్కూరు వెటర్నరీ డాక్టర్లు, ఇతర అనుబంధ శాఖల అధికారులు, గన్నవరం వెటర్నరీ కాలేజీ విద్యార్థులు, రైతులు పాల్గొన్నారు.

దివ్యాంగుల్లో ఆత్మస్థైర్యం నింపాలి

అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవంలో ఎంపీడీవో స్వర్ణలత, విజయడెయిరీ చైర్మన్ చలసాని



ఆశాజ్యోతి ఆశ్రమంలో కేక్ తినిపిస్తున్న చలసాని ఆంజనేయులు, గన్నవరంలో మాట్లాడుతున్న ఎంపీడీవో స్వర్ణలత

గన్నవరం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగుల్లో ఆత్మస్థైర్యాన్ని నింపాలని ఎంపీడీవో టి.స్వర్ణలత అన్నారు. మండల పరిషత్ ఆవరణలోని భవిత కేంద్రంలో బుధవారం అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఎంపీడీవో స్వర్ణలత మాట్లాడుతూ దివ్యాంగులను ప్రోత్సహిస్తే వారిలో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీయచ్చన్నారు. క్రమం తప్పకుండా భవిత కేంద్రానికి పిల్లలను పంపాలన్నారు. అనంతరం వివిధ పోటీల్లో రాణించిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. జడ్పీటీసీ సభ్యురాలు ఏఈ రాణి, డీవైఈవో కొండా రవికుమార్, ఎంఈవో-2 కమల, బాలుర హైస్కూల్ హెచ్‌ఎం ఎస్.వినీల, ఎంపీపీ పాఠశాల హెచ్‌ఎం సువర్ణ రాణి, రిసోర్స్ టీచర్‌లు తదితరులు పాల్గొన్నారు.

హనుమాన్‌జంక్షన్: ఏలూరు రోడ్డులోని ఆశాజ్యోతి మానసిక దివ్యాంగుల ఆశ్రమాన్ని బుధవారం విజయడెయిరీ చైర్మన్ చలసాని ఆంజనేయులు సందర్శించారు. కేక్ కట్ చేసి వారికి శుభాకాంక్షలు తెలిపారు. మజ్జిగ, పండ్లు, మిఠాయిలు పంపిణీ చేశారు. ఆశ్రమంలో దత్తత తీసుకున్న ఇరువురు చిన్నారుల యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ముందుగా ప్రతి ఒక్కరికి షేక్ హ్యాండ్ ఇచ్చి గుడ్ మార్నింగ్ తెలిపి వారిని సంతోషపరిచారు. ఆశ్రమం నిర్వాహకులు మాధవీలత. వెంకటస్వామిలను దుశ్శాలువాతో సత్కరించి అభినందించారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ నాయకులు తాడి రంగారావు, కృష్ణా మిల్క్ యూనియన్ సిబ్బంది పాల్గొన్నారు.

హనుమాన్‌జంక్షన్‌రూరల్: వీరవల్లి భవిత కేంద్రంలో బుధవారం గ్రామాభివృద్ధి కమిటీ అధ్యక్షుడు గుండపనేని ఉమావరప్రసాద్ వివిధ పోటీల్లో పాల్గొన్న దివ్యాంగులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ లంక అజయ్‌కుమార్, హెచ్‌ఎం ఉషారాణి, తదితరులు పాల్గొన్నారు.

8400 మందికి వైద్యసేవలు

గన్నవరం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): చిన అవుటపల్లి డాక్టర్స్ సుధా అండ్ నాగేశ్వరరావు సిద్ధార్థ దంత వైద్య కళాశాలలో జరుగుతున్న ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభిస్తుందని ప్రిన్సిపాల్ డాక్టర్ మూల్పూరి వెంకట రామోజీ రావు తెలిపారు. బుధవారం స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడుతూ నవంబరు 26 నుంచి ఇప్పటి వరకూ 160 గ్రామాల నుంచి 8400 మందికి ఉచిత దంత వైద్య సేవలను అందించి నట్లు చెప్పారు. ఈ నెల 6 వరకూ కొనసా గుతుందని, ఆరోజు రిజిస్ట్రేషన్ చేసుకున్న వారు నాలుగు నెలలలోపు ట్రీట్‌మెంట్ తీసుకోవచ్చని వివరించారు. ఏవో వై.మధుసూదనరావు, హెచ్‌వోడీలు పాల్గొన్నారు.

రైతులకు వాటర్‌ప్రూఫ్ పట్టాల పంపిణీ

పెనమలూరు, డిసెంబరు3(ఆంధ్రజ్యోతి): పోరంకిలో బుధవారం జరిగిన రైతన్నా...మీకోసం కార్యక్రమంలో పీఏసీఎస్ అధ్యక్షుడు మంచినేని పరమేష్ ఆధ్వర్యంలో టీడీపీ నేతలు రైతులకు వాటర్‌ప్రూఫ్ పట్టాలు పంపిణీ చేశారు. ఈ సంద ర్భంగా టీడీపీ నేతలు మాట్లాడుతూ రైతులు ఆరుగాలం కష్టం చేసి పండించిన పంట వర్షాలకు తడవకుండా వ్యవసాయ పరపతి సంఘాల ద్వారా ఈ పట్టాలు పంపిణీ చేస్తున్నామని తెలిపారు. కా ర్యక్రమంలో టీడీపీ నేతలు వెలగపూడి శంకర బాబు, అనుమోలు ప్రభాకరరావు, యార్లగడ్డ సుచిత్ర, శొంఠి శివరాంప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

పాతపాడులో అనధికార లే అవుట్ ధ్వంసం

విజయవాడ రూరల్, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి) : పాతపాడు గ్రామ పంచాయతీ పరిధిలోని అనధికార లే అవుట్‌లను సీఆర్‌డీఏ అధికారులు బుధవారం ధ్వంసం చేశారు. గ్రామంలోని సర్వే నెం 114లో 5.50 ఎకరాల్లో, సర్వే నెం 145లోని 1.20 ఎకరాల భూమిలో అనధికార లే అవుట్‌లు ఉండడాన్ని అధికారులు గుర్తించారు. సీఆర్‌డీఏ కమిషనర్ ఆదేశాల మేరకు సిబ్బంది సదరు లే అవుట్‌లను ధ్వంసం చేశారు.

శాస్త్రీయ దృక్పథానికి విద్యావైజ్ఞానిక యాత్ర



హనుమాన్‌జంక్షన్ రూరల్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించేలా సృజనాత్మక నైపుణ్యాభివృద్ధికి ఎక్స్‌పోజర్ విజిట్(విద్యావైజ్ఞానిక యాత్ర) దోహదపడుతుందని ప్రిన్సిపాల్ డి.ఏదునందన అన్నారు. వేలేరు, జవహర్ నవోదయ విద్యార్థులు బుధవారం విద్యావైజ్ఞానిక యాత్రకు బయలుదేరి వెళ్లారు. రాజమహేంద్రవరంలోని సైన్స్ సెంటర్, ధవళేశ్వరం బ్యారేజీ, సర్ ఆర్థర్‌కాటన్ మ్యూజియం తదితర ప్రదేశాలను సందర్శించనున్నట్లు తెలిపారు. ఉపాధ్యాయుడు బొడ్డపాటి ఆదినారాయణ పర్యవేక్షణలో 6నుంచి 12 తరగతులకు చెందిన విద్యార్థులను రెండు బ్యాచ్‌లుగా ఆర్టీసీ బస్సుల్లో బయలుదేరిన విద్యార్థులకు ప్రిన్సిపాల్ జెండా ఊపి ప్రారంభించారు.

అనీమియాపై అవగాహన సదస్సు

కానూరు, డిసెంబరు3(ఆంధ్రజ్యోతి): కానూరులోని సిద్ధార్థ డీమ్డ్ యూనివర్సిటీలో ఎన్ఎస్ఎస్ యూనిట్-2 ఆధ్వర్యంలో బుధవారం అనీమియాపై అవగాహన సదస్సు జరిగింది. ఈసందర్భంగా సిద్ధార్థ మెడికల్ సైన్సెస్ అండ్ రీసెర్చ్ ఫౌండేషన్ ప్రతినిధి డాక్టర్ జాస్మిన్ సుల్తానా మాట్లాడుతూ ఆహారంతోపాటు సమయానికి సరైన వైద్యపరీక్షలు కూడా చేయించుకోవాలని సూచించారు. విద్యార్థులు తగు జాగ్రత్తలు పాటిస్తూ ఆరోగ్యం కాపాడుకోవాలని ఆమె సూచించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ అధికారులు డాక్టర్ జె. శివరాంప్రసాద్, డాక్టర్ పి. సూష్మాచౌదరి, డాక్టర్ వేణుగోపాల్‌రెడ్డి, డాక్టర్ సీహెచ్ బేబీరాణి, విద్యార్థులు పాల్గొన్నారు.

పేరంటాలమ్మ హుండీ ఆదాయం రూ. 5.58లక్షలు

ప్రసాదంపాడు, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): శ్రీ వెంకమ్మ పేరంటాల అమ్మవారి హుండీ ఆదాయం రూ.5,58,900 వచ్చిందని ఈవో పి. ప్రియాంక తెలిపారు. బుధవారం ఉదయం ఆలయ ప్రాంగణంలో విజయవాడ డివిజన్ ఇన్‌స్పెక్టర్ ఏ.సృజన్‌కుమార్ ఆధ్వర్యంలో హుండీ లెక్కింపు చేపట్టారు. ఆలయ చైర్మన్, పాలక మండలి సభ్యులు, సాయి సేవాదళ్ సభ్యులు పాల్గొన్నారు.

వెనుకబడిన కులాలకు ప్రభుత్వ పథకాలందించాలి

కంకిపాడు, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ సంక్షేమ పథకాలను సమర్థంగా వెనుకబడిన కులాలకు అందించాలని కృష్ణా జిల్లా వెనుకబడిన కులాల ఐక్య వేదిక కన్వీనర్ నత్త వెంకటేశ్వరరావు అన్నారు. గ్రామ సచివాలయ, వార్డు సచివాలయ అధికారిగా బాధ్యతలు చేపట్టిన దివి బాబూజీని బుధవారం మర్యాద పూర్వకంగా కలిసి అభినందించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ప్రభుత్వం పంపిణీ చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి ఫలాలను వెనుకబడిన కులాలకు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో మాచర్ల రవి, గుదె జయప్రకాష్, చుండూరు మోహన్, ఉప్పులేటి కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పెంచలయ్య హత్యకు నిరసనగా కొవ్వొత్తుల ర్యాలీ

పెనమలూరు, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): నెల్లూరు జిల్లాలో గంజాయి వినియోగానికి వ్యతిరేకంగా కళారూపాలు ప్రదర్శిస్తూ ప్రజలను చైతన్యవంతం చేస్తున్న ప్రజానాట్యమండలి కళాకారుడు పెంచలయ్య హత్య దారుణమని, హంతకులను వెంటనే ప్రభుత్వం అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని పెనమలూరు ప్రజా నాట్యమండలి, మహిళా సంఘ సభ్యులు డిమాండ్ చేశారు. బుధవారం యనమలకుదురులో జరిగిన కొవ్వొత్తుల నిరసన ప్రదర్శనలో వారు పాల్గొని మాట్లాడారు. గంజాయి ముఠాల అకృత్యాలకు బలైన పెంచలయ్యకు ఘన నివాళులర్పించారు.

జాయింట్ స్టాఫ్ కౌన్సిల్‌లో ఎన్ఎంయూకు సభ్యత్వంపై హర్షం

ఉయ్యూరు, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీలో అతిపెద్ద అసోసియేషన్‌గా నిలచిన ఏపీపీటీడీ నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ జీవో 96 ద్వారా ప్రభుత్వ గుర్తింపు పొందడంతో పాటు ఆంధ్రప్రదేశ్ సివిల్ సర్వీసెస్ రాష్ట్రస్థాయి జాయింట్ స్టాఫ్ కౌన్సిల్‌లో సభ్యత్వం పొందడం హర్షణీయమని అసోసియేషన్ జిల్లా కమిటీ వర్కింగ్ ప్రెసిడెంట్ ఆవుల శ్రీనివాసరావు అన్నారు. అసోసియేషన్‌కు జాయింట్ స్టాఫ్ కౌన్సిల్‌లో సభ్యత్వం లభించిన సందర్భంగా డిపో కమిటీ సెక్రటరీ పెరవలి మురళీకృష్ణ ఆధ్వర్యంలో బుధవారం ఉయ్యూరు డిపో ఆవరణలో నిర్వహించిన గేట్ మీటింగ్‌లో సభ్యులు హర్షం ప్రకటించి ముఖ్యమంత్రి చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలియజేశారు. సభ్యులకు మిఠాయిలు పంచి సంతోషం వ్యక్తం చేశారు. డిపోకమిటీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

డివిజనల్ డెవలప్‌మెంట్ కార్యాలయ ప్రారంభం నేడు

ఉయ్యూరు, డిసెంబరు 3(ఆంధ్ర జ్యోతి): గుండిగుంట సచి వాలయం-2 ఆవరణలో డివిజనల్ డెవలప్‌మెంట్ కారా ్యలయాన్ని ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ గురువారం ఉదయం 11 గంటలకు వర్చువల్‌గా ప్రారంభించనున్నట్లు ఎంపీడీవో శేషగిరిరావు తెలిపారు. ఎమ్మెల్యేలు బోడె ప్రసాద్, వర్ల కుమార్‌రాజా హాజరు కానున్నట్లు తెలిపారు.




విజయవాడలో నిరసన వ్యక్తం చేస్తున్న అగ్రిగోల్డ్ బాధితులు

ఒక్క బాధితుడు మరణించినా
ప్రభుత్వానిదే బాధ్యత

- అగ్రిగోల్డ్ బాధితుల ఆవేదన దీక్షలో ముప్పాళ్ల నాగేశ్వరరావు

విజయవాడ (ధర్నాచౌక్), డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): ఒక్క అగ్రిగోల్డ్ బాధితుడు మరణించినా ప్రభుత్వమే బాధ్యత వహించాలని అగ్రిగోల్డ్ కస్టమర్స్ అండ్ ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు ముప్పాళ్ల నాగేశ్వరరావు హెచ్చరించారు. విజయవాడలోని ధర్నాచౌక్‌లో బుధవారం జరిగిన అగ్రిగోల్డ్ బాధితుల ఆవేదన దీక్షలో తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక, మహారాష్ట్ర, ఒడిశా నుంచి ఏజెంట్లు, ఖాతాదారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముప్పాళ్ల మాట్లాడుతూ కంపెనీలో పెద్ద మొత్తంలో డిపాజిట్ చేసిన సుమారు 10 లక్షల మందికిపైగా బాధితులకు న్యాయం జరిగేంత వరకు పోరాటం ఆగదని స్పష్టంచేశారు. త్వరలో సంస్థ యాజమాన్యాల ఇళ్లను ముట్టడించాలని పిలుపునిచ్చారు.

డాక్టర్ నరేష్‌బాబుకు ఐఓఏ గోల్డెన్ జూబ్లీ రీసెర్చ్ అవార్డ్

- రేడియోమిక్స్ సాంకేతికతతో కచ్చితమైన వ్యాధి నిర్ధారణ
- మూడోసారి ఈ పురస్కారం అందుకోనున్న గుంటూరు వైద్యుడు


డాక్టర్ నరేష్‌బాబు

గుంటూరు మెడికల్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): గుంటూరులోని మల్లిక స్పైన్ సెంటర్ అధినేత, చీఫ్ స్పైన్ సర్జన్ డాక్టర్ జె.నరేష్‌బాబు.. భారత ఆర్థోపెడిక్ వైద్యుల సంఘం(ఐఓఏ) ప్రకటించిన ప్రతిష్ఠాత్మక గోల్డెన్ జూబ్లీ రీసెర్చ్ అవార్డు 2025కు ఎంపికయ్యారు. దేశంలోని ఎముకల వైద్య నిపుణులకు అందించే ఈ అత్యుత్తమ పురస్కారాన్ని ఈ నెల 15 నుంచి 20 వరకు అస్సాంలోని గువహటిలో జరిగే ఇండియన్ ఆర్థోపెడిక్ అసోసియేషన్ (ఐఓఏ) 70వ వార్షిక సదస్సులో ఆయనకు ప్రదానం చేయనున్నారు. డైనమిక్ రేడియోమిక్స్ ఎనాలిసిస్ ఆఫ్ లిగమెంట్ ఫ్లావమ్ ఇన్ సర్వైకల్ మైలోపతి' అనే అంశంపై పరిశోధన నిర్వహించిన డాక్టర్ నరేష్‌బాబు.. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సాంకేతికను వినియోగించి రేడియోమిక్స్ ప్రక్రియ ద్వారా మెడలోని డిస్క్‌లను, లిగమెంట్లను, డైనమిక్ ఎంఆర్‌ఐతో జత చేసి విశ్లేషించారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మెషిన్ లెర్నింగ్, ఎంఆర్‌ఐలను కలిపి ఉపయోగించే అత్యాధునిక వినియోగించడం ఈ సాంకేతిక పరిజ్ఞానం ప్రపంచ ఆర్థోపెడిక్ వైద్య రంగంలో ఇదే తొలిసారి కావడం విశేషం. డాక్టర్ నరేష్‌బాబు 2008లో ఎముకల ఫ్లోరోసిస్‌పై చేసిన పరిశోధనకు మొదటిసారి, 2019లో వయో వృద్ధుల్లో నడుము అరుగుదల, వెన్నుపూస వంకర్ల గురించి చేసిన అధ్యయనానికి రెండోసారి ఈ అవార్డును అందుకున్నారు. ప్రస్తుతం మూడోసారి ఈ ప్రతిష్ఠాత్మకమైన అవార్డుకు ఎంపికయ్యారు. తెలుగు రాష్ట్రాల నుంచి ఈ అవార్డు అందుకున్న తొలి ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ నరేష్‌బాబే కావడం విశేషం.

ఈ నెల 23న అప్సా ఎన్నికలు

అమరావతి, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ సచివాలయ సంఘం (అప్సా) ఎన్నికలు ఈ నెల 23న జరగనున్నాయి. సంఘం ఎగ్జికూటివ్ కమిటీ సమావేశం బుధవారం అమరావతి సచివాలయంలోని అప్సా హాల్‌లో జరిగింది. ఈ నెల 29వ తేదీతో ప్రస్తుత అప్సా కార్యవర్గం పదవీకాలం ముగియనుంది. దీంతో ఈ నెల 23న అప్సాకు ఎన్నికలు నిర్వహించాలని ఎగ్జిక్యూటివ్ కమిటీ నిర్ణయం తీసుకుంది. ఈ నెల 11న అప్సా సర్వ సభ్య సమావేశం నిర్వహించనున్నారు. 12న అధికారికంగా ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేస్తారు. 15, 16 తేదీల్లో నామినేషన్ల స్వీకరణ, 17న నామినేషన్ల ఉపసంహరణ, 23న ఎన్నికలు నిర్వహించాలని అప్సా ఎగ్జిక్యూటివ్ కమిటీ నిర్ణయించింది.

చిన్నారులకు పాముకాటు

- తమ్ముడి మృతి.. అన్న పరిస్థితి విషమం


శివనారాయణ

పెద్దవడుగూరు, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): అనంతపురం జిల్లా పెద్దవడుగూరు మండలం కండ్లగూడూరు గ్రామంలో ఇద్దరు చిన్నారులను మంగళవారం రాత్రి కట్లపాము కాటేసింది. వీరిలో శివనారాయణ మరణించగా.. శివరామరాజు పరిస్థితి విషమంగా ఉంది. పెద్దవడుగూరు ఎస్‌ఐ ఆంజనేయులు, బాలుర బంధువులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కండ్లగూడూరు గ్రామానికి చెందిన వీరనారాయణస్వామి, లక్ష్మి దంపతులకు శివరామరాజు, శివనారాయణ అనే కుమారులు ఉన్నారు. పెద్ద కుమారుడు ఐదు, చిన్న కుమారుడు రెండో తరగతి చదువుతున్నారు. మంగళవారం రాత్రి ఇంట్లో నిద్రిస్తున్న సమయంలో కట్లపాము చిన్నారులను కాటేసింది. తెల్లవారుజామున 4 గంటల సమయంలో మూత్రవిసర్జన కోసం శివనారాయణ బయటకు వెళ్లి పడిపోయాడు. తల్లిదండ్రులు దగ్గరికెళ్లి చూడగా.. నోటి నుంచి నురగ వస్తోంది. ఇంట్లో నిద్రిస్తున్న శివరామరాజుకు కూడా నోటి నుంచి నురగ వస్తుండడంతో ఇరువురిని పామిడి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ శివనారాయణ (7) మృతిచెందాడు. శివరామరాజు పరిస్థితి విషమంగా ఉండడంతో అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు కట్లపాము కాటేసినట్టు నిర్ధారించారు. ఇద్దరు కుమారుల్లో ఒకరు చనిపోగా.. మరొకరు మృత్యువుతో పోరాడుతుండడంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపించారు.



దోబీ చేప.. 22 కిలోలు!

అల్లూరి సీతారామరాజు జిల్లా గూడెంకొత్తవీధి మండలం సీలేరులో గల గుంటవాడ జలాశయంలో బుధవారం 22 కిలోల చేప లభ్యమైంది. ఆంధ్ర-ఒడిశా సరిహద్దుల్లో గల కోందుగూడ గిరిజనులు రోజూ గుంటవాడ జలాశయంలో చేపల వేటకు వెళుతుంటారు. ఈ క్రమంలో బుధవారం ఉదయం వేటకు వెళ్లిన గిరిజనుల వలకు 22 కిలోల చేప చిక్కింది. ఈ చేపను సీలేరులో దోబీ చేపగా పిలుస్తారు. ఈ చేపను స్థానిక రెస్టారెంట్ యజమాని రూ.4 వేలకు కొనుగోలు చేశారు. - ఆంధ్రజ్యోతి, సీలేరు

బెట్టింగ్ భూతానికి యువకుడి బలి

రూ.15 లక్షలు అప్పులపాలై బలవన్మరణం

దుత్తలూరు (ఉదయగిరి), డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): బెట్టింగ్ భూతం మరో యువకుడి ప్రాణాన్ని బలిగొంది. కష్టపడకుండా డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతో ఆన్‌లైన్ బెట్టింగ్‌లకు అలవాటుపడిన ఓ యువకుడు.. అప్పులపాలై చివరకు ఆత్మహత్య చేసుకున్నాడు. నెల్లూరు జిల్లా మండల కేంద్రమైన దుత్తలూరు సెంటర్‌లో ఈ సంఘటన చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. సీతారామపురం మండలం రంగనాయుడుపల్లి ఎస్సీ కాలనీకి చెందిన వల్లెపు ప్రతాప్ (25) కొన్ని నెలలుగా అప్పులు చేసి మరీ ఆన్‌లైన్ బెట్టింగ్‌లు ఆడుతున్నాడు. ఈ క్రమంలో రూ.15 లక్షలు పోగొట్టుకున్నాడు. డబ్బులు కోల్పోవడం, మరోవైపు అప్పులిచ్చినవారు ఒత్తిడి చేయడంతో కొంతకాలం క్రితం కాలనీ నుంచి వెళ్లిపోయి కడపలో ఓ ప్రైవేటు ఉద్యోగం చేసుకుంటున్నారు. ఈ క్రమంలో మంగళవారం రాత్రి పడుకునేందుకు గదిలోకి వెళ్లిన ప్రతాప్ ఫ్యాన్‌కి ఉరి వేసుకుని ఆత్మహత్యకు చేసుకున్నాడు.

పొగే కదా అని వదిలేస్తే..!

- రాజధాని అమరావతికి పెద్ద సమస్యగా మారే ప్రమాదం
- అధికారుల్లారా బీ అలెర్ట్ ! కాల్చకుండా చర్యలు చేపట్టాలి
- అవశేషాలు భూమిలో కలిసేలా దున్నాలి


జగ్గయ్యపేట రూరల్ గ్రామాల్లోని పొలాల్లో వరి తగలబెడుతున్న రైతులు

(ఆంధ్రజ్యోతి, కంచికచర్ల)

పొగే కదా అని వదిలేస్తే సమీప భవిష్యత్తులో నవ్యాంధ్ర రాజధాని అమరావతి పరిధిలో ఇదొక పెద్ద సమస్యగా పరిణమించే ప్రమాదం పొంచి ఉంది. పొలాల్లో ఎక్కడికక్కడ పంటల అవశేషాలను, వ్యర్థాలను, చెత్తను కాల్చుతున్నారు. ఇప్పుడు ఇదొక సమస్యగా కనిపించనప్పటికీ, రాజధాని అమరావతిని కాలుష్య రహిత రాజధానిగా తీర్చిదిద్దే ప్రయత్నాలకు పెద్ద అవరోధం కానున్నది. గాలి కాలుష్యమేర్పడి, న్యూఢిల్లీ తరహాలో ఆక్సిజన్ కోసం ఇబ్బందులు పడే పరిస్థితి తలెత్తకుండ అధికారులు ముందుగానే చర్యలు తీసుకోవాల్సి ఉంది. ఇంతకు ముందు గ్రామాల్లో వంట కోసం కట్టెల పొయ్యిలు వాడేవారు. పత్తి, మిర్చి పంటలు పూర్తైన తర్వాత చెట్లను పీకి, ఇళ్ల వద్ద ప్రత్యేకంగా నిల్వ చేసి, వంట చెరుకుగా వినియోగించేవారు. కంది కట్టెతో అయితే ప్రహరీ గోడల మాదిరిగా దడులు కట్టేవారు. పట్టణాలే కాదు గ్రామాల్లో సైతం ప్రతి ఇంటిలో కూడా ఎల్‌పీజీ గ్యాస్ ఉండటంతో ఎవరూ కట్టెల పొయ్యిలను వాడటం లేదు. దీంతో పంటల అవశేషాలను ఎవరూ వినియోగించటం లేదు. పత్తి, మిర్చి పంటలు ఇళ్లకు రాగానే దున్నేస్తున్నారు. కొంత భాగం భూమిలో కలుస్తుండగా, మిగతా అవశేషాలకు నిప్పుపెడుతున్నారు. మొక్కజొన్న కండెలు విరిచిన తర్వాత ఎండిపోయిన తోటలను దగ్ధం చేస్తున్నారు. ఒకవైపు కూలీల కొరత వల్ల, మరోవైపు తుఫాన్ల భయంతో ఎక్కువ మంది రైతులు మాగాణి వరిని యంత్రాలతో కోయిస్తున్నారు. వరి దుబ్బులను, ముక్కలైన గడ్డిని తగలబెడుతున్నారు. చెరుకు నరికిన తర్వాత నిప్పు పెట్టట మన్నది ఒక ఆనవాయితీగా మారింది. కొద్దోగొప్పో వరిగడ్డి తప్పితే చేల నుంచి పంటల అవశేషాలను రైతులెవరూ ఇళ్లకు తీసుకురావటం లేదు.

పంట భూములు దెబ్బతింటాయి

అవశేషాలను కాల్చటం వల్ల సాధారణంగా పంట భూములకు మేలు జరుగుతుందని రైతులు భావిస్తున్నారు. ఇది వాస్తవం కాదు. భూమిలో పలు పోషకాలు, ఉపయోగపడే ఎరలు (వానపాములు) ఉంటేనే భూసారం ఉంటుంది. పంటలు కూడా సమృద్ధిగా పండుతాయి. నిప్పుపెట్టటం వల్ల ముఖ్యంగా భూమికి, పంటలకు మేలు చేసే పలురకాల సూక్ష్మజీవులు, ఎరలు చచ్చిపోతాయి. ఎరలు చచ్చిపోవటం వల్ల భూమిలో సేంద్రీయ ఎరువు తయారు కాక పోవటం వల్ల పోషక లోపాలు ఏర్పడతాయి. భూసారం తగ్గిపోయి నిస్సారం కావటంతో పంటల దిగుబడులు తగ్గుతాయి.

కాల్చకుండా చర్యలు తీసుకోవాలి

వరి గడ్డితో పాటుగా ఇతర పంటల అవశేషాలను, వ్యర్థాలకు నిప్పు పెట్టకుండ క్షేత్ర స్థాయిలో చర్యలు తీసుకోవాలి. పంటల అవశేషాలను కాల్చటం వల్ల జరిగే నష్టాలు, అనర్థాలు గురించి ముందుగా రైతుల్లో అవగాహన కల్పించాలి. లేని పక్షంలో భూమిలో పోషకాలు కోల్పోవటమే కాకుండ నవ్యాంధ్ర రాజధాని అమరావతి ప్రాంతం కూడా న్యూఢిల్లీలో మాదిరిగా పొగ బారిన పడే ప్రమాదం ఉంది.

అవశేషాలను కాల్చటం వల్ల కలిగే నష్టాలు

పంటల అవశేషాలను, వ్యర్థాలను తగులబెట్టటం వల్ల నష్టాలు తప్పితే ఏలాంటి ప్రయోజనా లేవు. అవశేషాలను, వ్యర్థాలను కాల్చటం వల్ల పొగ ఎక్కువగా వస్తుంది. దట్టమైన కారు మబ్బుల్లా పొగంతా ఆకాశంలో అలుముకుంటున్నది. పొగ వల్ల వాయు కాలుష్యం ఏర్పడుతుంది. స్వచ్ఛమైన గాలి కరువుతుంది. గాలిలో ఆక్సిజన్ శాతం తగ్గి, కార్బన్‌డయాక్సైడ్ శాతం పెరుగుతుంది. ఫలితంగా శ్వాసకోశ సంబంధమైన సమస్యలు ఉత్పన్నమవుతాయి. ఉపరితిత్తుల వ్యాధులు సంక్రమించే అవకాశం ఉంది. రోడ్ల పక్కన చెత్త, చెదారం కాల్చటం వల్ల వాహనాల రాకపోకలకు ఆటంకం కలుగుతున్నది. పైగా ఒక్కోసారి ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించకపోవటం వల్ల ప్రమాదాలు కూడా జరుగుతున్నాయి. ప్రధానంగా పర్యావరణానికి హాని కలుగుతుంది.

- సేంద్రీయ ఎరువు కోసం పచ్చిరొట్టను భూమిలో కలియదున్నుతాం. అదే విధంగా పంటల అవశేషాలను, ఇతర వ్యర్థాలను కూడా కాల్చకుండ దున్నాలి. భూమిలో కల్సి కుళ్లిపోయి సేంద్రీయ ఎరువుగా మారుతుంది. రోటోవేటర్, మల్చర్ యంత్రాలు, కంబైన్ హార్వెస్టర్ల ద్వారా వరి, పత్తి, మిర్చి, మొక్కజొన్న దున్నితే సత్వరం భూమిలో కల్సిపోతుంది.

బయో ఇంధనంగా మార్చవచ్చు

పంటల అవశేషాలు, వ్యర్థాలను బయో ఇంధనంగా వినియోగిస్తున్నారు. పైరోలిసిస్ ప్రక్రియ ద్వారా అవశేషాలను బొగ్గు (బయోచార్)గా మార్చుతున్నారు. ముఖ్యంగా దీనిని బొగ్గుతో కల్పి కో-ఫైరింగ్‌గా వాడుతున్నారు. విద్యుత్ ప్లాంట్లలో, బ్రాయిలర్స్‌లో ఇంధనంగా ఉపయోగిస్తున్నారు. కాలుష్యరహితం కావటంతో కేంద్ర ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది.

నడిపించండి.. మీ వెంటే ఉంటా..

- రంగా ఆశయాలను ముందుకు తీసుకెళ్లే ప్రతిఒక్కరూ ఆయన వారసులే
- కులమతాలకు అతీతంగా రంగానాడు
- రంగానాడు పోస్టర్ ఆవిష్కరణలో వంగవీటి ఆశా కిరణ్



రంగానాడు పోస్టర్ ఆవిష్కరణలో వంగవీటి ఆశా కిరణ్, శంతన్‌కుమార్, గాదె బాలాజీ తదితరులు

విజయవాడ, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): "మీరు నన్ను నడిపించండి.. నేనే మీ వెంట ఉంటా.. వంగవీటి రంగా ఆశయాలను ముందుకు తీసుకెళ్లే ప్రతి ఒక్కరూ ఆయన వారసులే" అని వంగవీటి రంగా కుమార్తె వంగవీటి ఆశా కిరణ్ పేర్కొన్నారు. నగరంలోని ఓ హోటల్‌లో బుధవారం రాధారంగా రాయల్ అసోసియేన్ ఆధ్వర్యంలో రంగానాడు పోస్టర్ ఆవిష్కరణ జరిగింది. ఈ కార్యక్రమంలో ఆశా కిరణ్ మాట్లాడుతూ, రాధా రంగ మిత్రమండలి సభ్యులను చూస్తే ఒక కుటుంబాన్ని చూసినట్టుగా ఉందన్నారు. రాజకీయంగా ఎటువంటి నిర్ణయం తీసుకోలేదని, రాధారంగా మిత్రమండలి తరఫున పనిచేయడానికి వచ్చానని, ప్రస్తుతం ఏ పార్టీతో తనకు సంబంధం లేదని వెల్లడించారు. రంగా ఆశయ సాధన కోసం చేస్తానని, రాధారంగ మిత్ర మండలి చారిటబుల్ కింద పనిచేస్తుందని, కులాలకు, మతాలకు, పార్టీలకు అతీతంగా సేవచేయడమే తనముందున్న లక్ష్యమన్నారు. "మా అన్న వంగవీటి రాధాకృష్ణతో ఎటువంటి విభేదాలు లేవు. అన వసరంగా గాసిప్స్ ప్రచారం చేయొద్ద"ని విజ్ఞప్తి చేశారు. డిసెంబరు 26న విశాఖలో జరిగే రంగానాడు సభకు వంగవీటి రాధాకృష్ణను ఆహ్వానించామన్నారు. ఎన్నికలకు మూడేళ్ల సమయముందని, మూడేళ్ల తన పనితీరు, సేవా కార్యక్రమాలు రంగ అభి మానులు, పెద్దలు చూస్తారని రాధారంగ మిత్రమండలి పెద్దలు ఆదేశాలు, సూచనల ప్రకారం రాజకీయ నిర్ణయం ఉంటుందని ఆశాకిరణ్ పేర్కొన్నారు. అనంతరం వంగవీటి శంతన్‌కుమార్ మాట్లాడుతూ, రంగా దూరమై నేటికి 38 సంవత్సరాలైనా అభిమాలను ఆరాధ్య దైవంగా కొలవడం గర్వంగా ఉందన్నారు. వంగవీటి వంశంలో పెద్ద కమారుడిగా తన సోదరి ఆశాకిరణ్‌ను స్వాగతిస్తున్నాన న్నారు. గాదె బాలాజీ సారధ్యంలో విశాఖలో రంగానాడు సభ జరుగుతుందని, అన్ని పార్టీల్లో ఉన్న రంగా అభిమానులు ఈ సభకు తప్పకుండా రావాలని పిలుపునిచ్చారు. రాధారంగ రాయల్ అసోసియేషన్ కన్వీనర్ గాదె బాలాజీ మాట్లాడుతూ, ఒక కులానికి, ఒక వర్గానికి చెందిన వ్యక్తి కాదన్నారు. 2019లో రాధారంగ మిత్రమండలి, 2023లో కాపునాడు సభ ఏర్పాటు చేశామని గుర్తుచేశారు. డిసెంబరు 26న రంగానాడు పేరుతో విశాఖపట్నంలో భారీ బహిరంగ సభ ఏర్పాటు చేస్తున్నామని ఈ సభకు అన్ని వర్గాలకు చెందిన రంగా అభిమా నులు రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆమంచి సోములు, నగేష్, పలు జిల్లాలకు చెందిన రాధారంగ మిత్రమండలి నాయకులు పాల్గొన్నారు.


'అనస్థీషియా డ్రగ్ ఎర్రర్' పుస్తకాన్ని ప్రారంభిస్తున్న ఐయోవా యూనివర్సిటీ హెల్త్ సైన్సెస్ సెంటర్ మాజీ అనస్థీషియా ప్రొఫెసర్ రాబర్ట్, వీసీ చంద్రశేఖర్

వైద్య విద్యను బలోపేతం చేయడమే లక్ష్యం

విజయవాడ, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): రోగి భద్రతను మెరుగుపరచడం, వైద్య విద్యను బలోపేతం చేయడమే లక్ష్యంగా డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం దేశవ్యాప్తంగా వైద్య వర్గాలకు ఉపయోగపడే విధంగా అకడమిక్ కార్యక్రమాన్ని ప్రారంభించింది. యూనివర్సిటీ వెబినార్ హాల్‌లో బుధవారం జరిగిన కార్యక్రమంలో భాగంగా "డిటెక్షన్, డామేజ్ కంట్రోల్ అండ్ డిఫెన్స్ స్ట్రాటజీస్ ఆఫ్ డ్రగ్ ఎర్రర్స్ ఇన్ అనస్థీషియా" అనే అంశంపై ఉన్నత స్థాయి వెబినార్ నిర్వహించింది. ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ వైస్ చాన్సలర్ డాక్టర్ చంద్రశేఖర్ మాట్లాడుతూ, ప్రపంచ వ్యాప్తంగా ప్రాముఖ్యం ఉన్నప్పటికీ తరచూ నిర్లక్ష్యానికి గురయ్యే అంశంపై విశ్వవిద్యాలయం అకడమిక్ చర్చకు వేదికగా నిలిచిందన్నారు. అనంతరం ఐయోవా యూనివర్సిటీ హెల్త్ సైన్సెస్ సెంటర్ మాజీ అనస్థీషియా ప్రొఫెసర్ డా.రాబర్ట్‌తో కలిసి వైస్ చాన్సులర్ "అనస్థీషియా డ్రగ్ ఎర్రర్" అనే పుస్తకాన్ని ప్రారంభించారు.


ధాన్యం రాశులను పరిశీలిస్తున్న జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియా

ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలి

- అధికారులతో జేసీ ఇలక్కియా

కలెక్టరేట్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియను వేగవంతం చేయాలని జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియా అధికారులను ఆదేశించారు. బుధవారం విజయవాడ రూరల్ నున్నలో జేసీ పర్యటించి రైతుల నుంచి ధాన్యం కొనుగోలు ప్రక్రియను పరిశీలించారు. రైతులతో మాట్లాడి ఏవైనా ఇబ్బందులు ఉన్నాయా అని అడిగి తెలుసుకొన్నారు. దళారులను ఎట్టి పరిస్థితుల్లోనూ నమ్మవద్దని పేర్కొన్నారు. జిల్లాలో 150 రైతు సేవా కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోళ్లు జరుగుతున్నాయన్నారు. కల్లాల్లో ధాన్యాన్ని యుద్ధప్రాతిపదికన కొనుగోలుతో పాటు సురక్షిత ప్రాంతాలకు తరలించడం, ధాన్యం తడవకుండా ముందస్తు చర్యగా 2,200 టార్పాలిన్లను పంపిణీ చేయడం జరిగిందన్నారు.

ఉరుసు నిర్వహణకు సహకరిస్తాం

ఇబ్రహీంపట్నం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : కొండపల్లిలోని హజరత్ సయ్యద్ షాబుఖారీబాబా దర్గా ఉరుసు మహోత్సవం నిర్వహణకు ఎన్టీటీపీఎస్ సంస్థ నుంచి పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని చీఫ్ ఇంజనీరు శివ రామాంజనేయులు స్పష్టం చేశారు. దర్గాకు వెళ్లే వంతెన కింద ఎన్టీటీపీఎస్ తవ్వకాలు చేయడం వల్ల వంతెన పునాదులు బలహీన పడ్డాయని ఉరుసు నిర్వహణ కమిటీ ఆగ్రహం వ్యక్తం చేయడంతో బుధవారం ఎన్టీటీపీఎస్ సీఈ, స్టాఫ్ వంతెనను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో అల్తాఫ్ బాబా, టీడీపీ నేత జంపాల సీతారామయ్య, కో-ఆప్షన్ సభ్యుడు మహబూబ్ సుభాని, ఎన్టీటీపీఎస్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ సీఈ శ్రీధర్, దర్గా ముజావర్లు పాల్గొన్నారు.

పర్యాటకాభివృద్ధి కోసమే ప్రైవేటుకు లీజు

ఆంధ్రజ్యోతి కథనంపై ఏపీటీడీసీ వివరణ

(ఆంధ్రజ్యోతి, విజయవాడ)

పర్యాటకాభివృద్ధి సంస్థ (ఏపీటీడీసీ)కు చెందిన హోటల్స్ ఆపరేషన్స్ అండ్ మెయింటెనెన్స్ (ఓఅండ్‌ఎం) కింద ప్రైవేటు భాగస్వాములకు అప్పగించాలని ప్రభుత్వం ఆదేశించిందని, ఇదే సందర్భంలో నాణ్యతా ప్రమాణాలు, పర్యాటకులకు ఉత్తమ సేవలు వంటివి అందించేలా చర్యలు చేపట్టాలని కూడా నిర్దేశించిందని ఏపీ టీడీసీ యాజమాన్యం తెలిపింది. బుధవారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన 'పర్యాటక రచ్చ ' కథనంపై ఏపీటీడీసీ ఉన్నతాధికారులు స్పందించారు. ఈ మేరకు తమ వివరణను తెలిపారు. ఏపీటీడీసీ ఆస్తులను వ్యూహాత్మకంగా జోన్లు, క్లస్టర్లుగా విభజించాలని ప్రభుత్వం నిర్దేశించిందని, ఒక్కోదాని పరిధిలో 7 నుంచి 8 వరకు ఆస్తులు ఉండాలని నిర్దేశించటం జరిగిందని, ఈ విధానం ద్వారా ఏపీటీడీసీ అధిక ఆదాయం వస్తుందన్నది ప్రభుత్వ విధానంగా ఉందని పేర్కొంది. ఈ నమూనాను అనుసరించి రాష్ట్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపి అర్హత కలిగిన ప్రైవేటు ఆపరేటర్ల నుంచి బిడ్లను ఆహ్వానిస్తూ ఆగస్టు 25 వ తేదీన రిక్వెస్ట్ ఫర్ ప్రపోజల్స్ (ఆర్‌ఎఫ్‌పీ)ని జారీ చేయటం జరిగిందని తెలిపింది.

పశువుల హాస్టల్ ఏర్పాటు అభినందనీయం

చిట్టినగర్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రతి నియోజకవర్గానికి రూ.10 లక్షల వ్యయంతో ఒక పశువుల హాస్టల్ ఏర్పాటుకు ప్రభుత్వం ఆమోదం తెలపడం అభినందనీయం కృష్ణామిల్క్ యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పాడి పరిశ్రమ అభివృద్ధికి నిర్ణయం తీసుకున్న సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, పశుసంవర్ధకశాఖ మంత్రి అచ్చెన్నాయుడు, కూటమి ప్రభుత్వానికి సంస్థ తరఫున కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లు చలసాని ఆంజనేయులు తెలిపారు.

2016 చట్టాన్ని అమలు చేయండి

- ఆల్ ఇండియా యూకో బ్యాంక్ దివ్యాంగజన్ ఎంప్లాయిస్ సంఘం

గాంధీనగర్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం దివ్యాంగ ఉద్యోగుల కోసం తీసుకువస్తున్న పాలసీలు క్షేత్రస్థాయిలో అమ లు కావడం లేదని ఆల్ ఇండియా యూకో బ్యాంక్ దివ్యాంగజన్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు ఏ.శ్రీనివాసులు ఆవేదన వ్యక్తం చేశారు. గాంధీ నగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో బుధవారం ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో ఆయన మాట్లాడారు. దివ్యాంగులకు ప్రపంచ వికలాంగుల దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. 2016లో తీసుకువచ్చిన వికలాంగుల చట్టాన్ని నేటి వరకు అమలు చేయకపోవడం శోచనీయమన్నారు. దివ్యాంగ ఉద్యోగులకు సం బంధించిన విధానాలను అమలు చేసేందుకు భారత ప్రభుత్వ ఆధ్వర్యంలోని సామాజిక న్యాయ సంక్షేమశాఖ, దివ్యాంగశాఖలతో తమ సంఘం కలిసి పని చేస్తుందన్నారు. వెంకటేశ్వరరావు, ఏడుకొండలు, శ్యామ్, డి.శివ పాల్గొన్నారు.

వక్ఫ్ ఆస్తుల వివరాలు అప్‌లోడ్ చేయండి

లబ్బీపేట, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఉమిద్ పోర్టల్‌లో వక్ఫ్ ఆస్తుల రిజిస్ట్రేషన్‌ను పొడిగించడానికి స ుప్రీంకోర్టు నిరాకరించిన సందర్భంలో అన్ని వక్ఫ్ ముత్వల్లిలు, అడ్మినిస్ట్రేటివ్ కమిటీలు డిసెంబర్ 5నాటికి అప్‌లోడ్ చేయడానికి తమవంతు ప్రయత్నం చేయాలని ముస్లిం జేఏసీ కన్వీనర్ మునీర్ అహ్మద్ విజ్ఞప్తి చేశారు. లబ్బీపేటలోని జేఏసీ కార్యాలయంలో బుధవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, వక్ఫ్ రిజిస్ట్రేషన్ షెడ్యూల్ చివరితేదీ నాటికి http:/umeed. minorityaf-fairs,gov.in పోర్టల్‌లో అప్‌లోడ్ చేయకపోతే దీనికోసం వక్ఫ్ ట్రిబ్యునల్‌ను సంప్రదించాల్సి ఉంటుందన్నారు. సాంకేతిక లోపాలు, మరేదైనా కారణం వలన డిజిటలైజేన్, అప్‌లోడ్ పూర్తికాకపోతే sup-port-umeed@gov.inని సంప్రదించాలని తెలిపారు.

దినదినగండంగా ధాన్యం రైతు పరిస్థితి

- మొన్న మొంథా తుఫాన్, నేడు దిత్వా తుఫాన్
- వరి రైతులకు దెబ్బమీద దెబ్బ


తోట్లవల్లూరులో రోడ్డుపై ధాన్యాన్ని ఆరబెడుతున్న రైతు

తోట్లవల్లూరు, డిసెంబరు 3, (ఆంధ్రజ్యోతి) : ఖరీఫ్ ధాన్యం చేతికొచ్చే సమయంలో తుపానులు రైతులను దెబ్బ తీస్తున్నాయి. అక్టోబరు 28న మొంథా తుఫాన్ వచ్చి వరి చేలను నాశనం చేసింది. వందల ఎకరాల్లో వరిచేలు చాపలా నేలకు అతుక్కుపోయి నీటిలో ధాన్యం గింజలు నాని పంట దిగుబడిపై దెబ్బకొట్టింది. ఎకరాకు 35 బస్తాల దిగుబడి వస్తుందని ఆశించగా కేవలం 25 నుండి 30 బస్తాల దిగుబడితో సరిపెట్టుకోవలసి వస్తోందని రైతులు చెప్పారు. మొంథా తుఫాన్ వల్ల ఎకరాకు 10 బస్తాల ధాన్యాన్ని కోల్పోవలసి వచ్చిందని చెప్పారు. మరోవైపు నెలకు అతుక్కున్న వరిచేలలో కోతకు ఎకరాకు రూ. 7 వేల వరకు చెల్లించాల్సి వచ్చిందని, మిషన్‌తో కోయించాలంటే మూడు గంటల సమయం పడుతోందని, దీంతో మిషన్‌కు కోత కూలి రూ. 10 వేల వరకు చెల్లిస్తున్నట్టు రైతులు తెలిపారు. ఇలా మొంథా తుఫాను గండం నుంచి గట్టెక్కుతున్న తరుణంలో నెల రోజుల వ్యవధిలోనే దిత్వా తుఫాను సంభవించిందని, ఈ దిత్వా భారీ విధ్వంసం సృష్టించకపోయినా కంటిమీద కునుకు లేకుండా చేస్తోందని అన్నదాతలు ఆవేదన చెందుతున్నారు. వారం రోజుల నుంచి దినదిన గండం అన్న పరిస్థితిని ఎదుర్కొంటున్నారు. కొంచెం సేపు సన్నని జల్లులు, మరలా పొడి వాతావరణం, మరోక రోజు జల్లులు ఇలా రైతులను దిత్వా ముప్ప తిప్పలు పెడుతోంది. ఈ తుఫాను బారిన పడకుండా ఉండేందుకు రైతులు ఒకేసారి యంత్రాలతో కోతలు కోయించటంతో ఆ ధాన్యాన్ని ఆరబెట్టేందుకు వీల్లేకుండా ఉంటోంది. పొలాల్లో నుంచి రోడ్లపైకి తెచ్చి ఆరబెట్టటం, మళ్లీ పోగు చేసి పరదాలు కప్పటం, మళ్లీ ఆరబెట్టటం ఇలా అన్నదాతలతో దిత్వా ఆటాడుకొంటోంది. మరోవైపు గోనె సంచులు సరిపడా అందించటంలోను, వాహనాలను సమకూర్చటంలో అధికారులు విఫలం కావటంతో కాటాలు వేసిన ధాన్యం బస్తాలను రోడ్లపైనే ఉంచాల్సిన పరిస్థితి దాపురించింది.


మొంథా తుఫాన్‌కు దెబ్బతిన్న వరిచేను (ఫైల్)



బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	144, 153, 164
చికెన్ విత్ స్కిన్	274
చికెన్ స్కిన్‌లెస్	284

నెక్ కోడిగుడ్డు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ. 665

ఆంజనేయస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు

గుడ్లవల్లేరు, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : హనుమత్ వ్రతాల సందర్భంగా బుధవారం మండలంలో పలుగ్రామాల్లో ఆంజనేయస్వామి ఆలయాల్లో ప్రత్యేకపూజలు నిర్వహించారు. గుడ్లవల్లేరు రమా సహిత సత్యనారాయణస్వామి ఆలయంలోని అభయాంజనేయ స్వామి మందిరంలో ఆంజేయస్వామికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామిని పుష్పాలతో అలంకరించి తమలపాకుల మాలలు వేశారు. రెడ్డిపాలెంలో వేంచేసియున్న అభయాంజనేయస్వామికి పలు రకాల పండ్ల రసాలతో అభిషేకాలు, పంచామృతాభిషేకం నిర్వహించారు. భక్తులు పాల్గొని పూజలు నిర్వహించారు.



ప్రత్యేక అలంకరణలో ఆంజనేయస్వామి



ఆరబెట్టిన ధాన్యాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ డీకే బాలాజీ

రైతులకు సరిపడా సంచులు అందజేస్తాం

● కలెక్టర్ డీకే బాలాజీ

పమిడిముక్కల, డిసెంబరు3 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో ఆందోళనతో రైతులు యంత్రాలతో ఒకేసారి పెద్దమొత్తంలో కోతలు కోయడవల్ల సంచుల అవసరం ఎక్కువగా ఏర్పడింద ని అందరికి సరిపడా సంచులు అందుబాటులో ఉంచుతామని కలెక్టర్ డీకే బాలాజీ రైతులకు ధైర్యం చెప్పారు. మ్రరివాడ పరిధిలో ప్రధాన రహదారిపై ఆరబెట్టిన ధాన్యపు రాశులను బుధవారం పరిశీలించి రైతులతో మాట్లాడి సమస్యలు అడిగితెలుసుకున్నారు. వర్షాల వల్ల పంటలో మానుగాయ తెగులు సోకి గింజ రంగుమారడం వల్ల ఎవరు కొనుగోలు చేయడం లేదని రైతులు కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. కోత ఎప్పుడు కోశారు. ఎంత తేమ శాతం ఉందని రైతులు ఆరాతీశారు. గత సంవత్సరం కంటే అదనంగా 30లక్షల గోనె సంచులు అందుబాటులో ఉంచామని తెలిపారు. టార్పాలిన్లు కొందరికి ఇచ్చారన్న సమాచారం తెలుసుకుని అవసరమైన వారందరికి ఇవ్వాలని అధికారులకు ఫోన్‌లో ఆదేశాలిచ్చారు.

విశ్రాంత ఎంఈవో మృతి

పామర్రు : పామర్రు మండల విశ్రాంత మండల విద్యాశాఖ అధికారి ఎన్.సీతారామరాజు(78) అనారోగ్యంతో హైదరాబాద్‌లో చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందారు. ఆయన పెద్ద కుమార్తె ఎంపీపీ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలుగా పనిచేస్తుండగా, అల్లుడు సతీష్ పామర్రు బీఎస్‌ఎన్‌ఎల్ సంస్థలో జేఈగా సేవలందిస్తున్నారు. మృతదేహాన్ని హైదరాబాద్ నుంచి పామర్రు కు తీసుకువస్తున్నట్లు సతీష్ తెలిపారు. మండలంలో సీతారామరాజు అందించిన సేవలను గుర్తుచేసుకుని ఆయన మృతిపట్ల సంతాపం తెలియజేశారు.

శ్రీలక్ష్మీగణపతి హోమం 8న

గుడివాడ : విఘ్నేశ్వరస్వామి దేవస్థానంలో ఈ నెల 8వ తేదీన సంకటహర చతుర్థి సందర్భంగా శ్రీలక్ష్మీగణపతి హోమం పూజ నిర్వహిస్తున్నట్టు ఆలయ కార్యనిర్వాహణాధికారి శ్రీనివాసరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.

దివ్యాంగులను ప్రేమతో ఆదరించాలి

● ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా



దివ్యాంగులకు మూడు చక్రాల ఎలక్ట్రిక్ సైకిళ్లను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా

పామర్రు, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): సమాజంలో దివ్యాంగులను ప్రేమతో ఆదరించాలని ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా అన్నారు. ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా స్థానిక పీ-4కార్యాలయం వద్ద బుధవారం ముగ్గురు దివ్యాంగులైన వారికి రూ.30వేల విలువగల మూడు చక్రాల బ్యాటరీ సైకిళ్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూదివ్యాంగుల పింఛన్ రూ 3వేలనుంచి ఆరువేల పెంచి వారి జీవితాలకు భరోసా కల్పించిన ఘనత సీఎం చంద్రబాబుదేనన్నారు. కూటమి నేతలు పాల్గొన్నారు.

మండల పరిధిలోని ఎలకుర్రులో దివ్యాంగుల పాఠశాలలో కేడీబీ ట్రస్టు ఆధ్వర్యంలో బుధవారం ప్రపంచ దివ్యాంగల దినోత్సవం నిర్వహించారు. ముఖ్య అతిధిగా జయ వైద్యశాల పిల్లల వైద్యనిపుణులు డాక్టర్ పి.సురేష్‌చంద్రారెడ్డి హాజరయ్యారు. ఎలకుర్రు కేడీబీ ట్రస్టు కార్యదర్శి నాగేశ్వరావు, కేడీబీ ట్రస్టు సిబ్బంది పాల్గొన్నారు.

గుడ్లవల్లేరు: దివ్యాంగులకు ప్రభుత్వం ఎన్నో రాయితీలు కల్పిస్తోందని ఎంపీడీవో మహమ్మద్ ఇమ్రాన్ అన్నారు. బుధవారం ప్రపంచ దివ్యాంగ దినోత్సవాన్ని కౌతవరం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో నిర్వహించారు. ముఖ్యఅతిధిగా పాల్గొన్న ఎంపీడీవో ఇమ్రాన్ మాట్లాడుతూ దివ్యాంగ విద్యార్థులకు విద్యారంగంలో పదోతరగతికి ఫీజు, సబ్జెక్టుల మినహాయింపు కల్పిస్తోందన్నారు. కొన్ని క్యాటగిరిల వారికి పదిమార్కులకే పాసుమార్కులు ఇవ్వడం, ఉపకార వేతనాలు,ఉపకరణాలు ఇవ్వడం, మెడికల్ క్యాంపులు నిర్వహిస్తోందన్నారు. ఎంఈవో జగన్మోహనరావు, ఫిజియో థెరపిస్టు ప్రత్తిపాటి కామరాజు, సమగ్ర శిక్షణ క్లస్టర్ రిసోర్సు పర్సన్‌లు తదితరులు పాల్గొన్నారు.



విజేతలకు బహుమతులు ప్రధానం చేస్తున్న ఎంపీడీవో ఇమ్రాన్

కూచిపూడి: ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం పురస్కరించుకుని మొవ్వ భవిత సెంటర్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మొవ్వ ఎంఈవో-1 భాను ప్రకాష్ ముఖ్యఅతిధిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా దివ్యాంగ విద్యార్థినీ, విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు వివిధ అంశాల్లో పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశా రు. ఎంఈవో -2 కె.శ్రీలక్ష్మీ, గ్రామసర్పంచ్ పూర్ణచంద్రరావు, పాఠశాలల హెచ్‌ఎంలు ఉమశ్రీ, నాగలక్ష్మి, ఐఈఆర్‌టీ ఉపాధ్యాయులు కె.వాణిశ్రీ, నాగ సాయిశ్రీ పాల్గొన్నారు.



గీతామహాలక్ష్మిని సన్మానిస్తున్న ఎంఈవో -2 బాలాజీ

బోధనకు అగవైకల్యం అడ్డుకాదు

గుడివాడ రూరల్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని, ఉపాధ్యాయురాలు సీతామహాలక్ష్మి అత్యుత్తమంగా బోధిస్తున్నారని ఎంఈవో -2 బాలాజీ అన్నారు. బుధవారం వరల్డ్ డీసీబీ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా ఎంఈవో-2 గీతామహాలక్ష్మిని ఘనంగా సన్మానించి సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్న వయస్సులోనే చక్కటి విద్యను బోధిస్తున్న ఉపాధ్యాయురాలిని అభినందిస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు దానియేలు పాల్గొన్నారు.



మొవ్వలో దివ్యాంగ విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న భాను ప్రకాష్

తోట్లవల్లూరు : దివ్యాంగులకు శారీరక లోపం శాపంగా కాకుండా వారికి దివ్యమైన భవిష్యత్తుని కల్పించే బాధ్యత అందరిపై ఉందని, ఇందుకు తల్లిదండ్రులు భవిత కేంద్రాలకు వారిని తీసుకు రావటం, ప్రభుత్వం కల్పించే సౌకర్యాలను పొందే విధంగా చేయటం ప్రధానమని రాష్ట్ర గౌడ కార్పొరేషన్ ఛైర్మన్ వీరంకి వెంకట గురుమూర్తి అన్నారు. తోట్లవల్లూరు భవిత కేంద్రంలో బుధవారం నిర్వహించిన అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవ వేడుకలకు ముఖ్యఅతిధిగా గురుమూర్తి హాజరయ్యారు. తహసీల్దార్ ఎం కుసుమకుమారి మాట్లాడుతూ దివ్యాంగులకు ఉద్యోగాలలో రిజర్వేషన్స్ ఉన్నాయని, వారిని చదివిస్తే ఆ ఉద్యోగాలు పొందగలుగుతారని అన్నారు. ఈ సందర్భంగా దివ్యాంగులకు బహుమతులను, టీఎల్‌ఎం కిట్‌లను పంపిణీ చేశారు. ఐఈఆర్‌పీ టీచర్లు జి నిరుపమ, పద్మావతిలను గురుమూర్తి శాలువాలతో సత్కరించారు. ఎంఈవో జి వెంకటేశ్వరరావు, జడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం ఫణి రాజమోహన్, ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం విజయశ్రీ, జడ్పీ హైస్కూల్ ఎస్‌ఎంసీ ఛైర్మన్ వల్లూరు సుజాత, తదితరులు పాల్గొన్నారు.



తోట్లవల్లూరు భవిత కేంద్రంలో దివ్యాంగులకు బహుమతులు అంజేస్తున్న గురుమూర్తి

దుప్పట్ల పంపిణీ

పమిడిముక్కల, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ వ్యవస్థాపకుడు, యెల్విన్ జోన్స్ జయంతి, ఆంధ్రప్రదేశ్ లయన్స్ సేవాయజ్ఞం వ్యవస్థాపక దినోత్సవం పురస్కరించుకుని లయన్స్‌క్లబ్ ఆఫ్ కపిలేశ్వరపురం ఆధ్వర్యంలో బుధవారం వృద్ధులు, పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. గీతామందిరం ప్రాంగణంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో అన్నసమారాధన చేశారు. ఎన్‌ఆర్‌ఐ డాక్టర్ మాధవి సహకారంతో గత పది సంవత్సరాలుగా సీతాకాలంలో పేదలకు దుప్పట్లు పంపిచేస్తున్నట్టు క్లబ్ సెక్రటరీ తుమ్మల వెంకటగంగాధరరావు తెలిపారు. క్లబ్ అధ్యక్షుడు తాతినేని సాయిదత్, కోశాధికారి చిగురుపాటి శ్రీకృష్ణ బ్రహ్మానందరావు, సభ్యులు చిగురుపాటి జగదీశ్, తుమ్మల ల క్ష్మీనారాయణ, ఎం.నరేంద్ర తదితరులు పాల్గొని సేవలందించారు.

పట్టణ సుందరీకరణలో అందరి భాగస్వామ్యం తప్పనిసరి

● ఎమ్మెల్యే వెనిగండ్ల రాము

గుడివాడ, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి) : గుడివాడలో మార్పు కనిపించేలా అభివృద్ధి పనులతో పాటు పట్టణ సుందరీకరణపై ప్రత్యేక దృష్టిసారించామని, పట్టణ సుందరీకరణలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యులవ్వాలని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక కోగంటి రాజబాపయ్య చౌక్ వద్ద కొనసాగుతున్న అభివృద్ధి పనులను ఆయన పరిశీలించారు. నిర్మాణ పనుల పురోగతిని అధికారుల నుంచి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలోని నెహ్రూచౌక్ సెంటర్, రాజబాపయ్యచౌక్‌తో పాటు ప్రధాన కూడళ్లను అభివృద్ధి చేస్తున్నామన్నారు. అపరిశుభ్ర వాతావరణంలో ఉండే ఏజీకే మున్సిపల్ ఉన్నత పాఠశాల వద్ద ఐ లవ్ గుడివాడ నేమ్ బోర్డు, గ్రీనరీ ఏర్పాటు చేస్తున్నామన్నారు. శిథిలావస్థకు చేరుకున్న పోస్టాఫీసు రోడ్డులోని ప్రధాన డ్రెయిన్‌ను అభివృద్ధి చేస్తున్నామన్నారు. ఈ డ్రెయిన్ మరమ్మతులతో భారీ వర్షాలు కురిసిన అవుట్‌ఫ్లోకు ఇబ్బంది ఉండదన్నారు. నిర్ణీత సమయానికల్లా అభివృద్ధి పనులన్నీ పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. మున్సిపల్ కమిషనర్ సింహాద్రి మనోహర్, మున్సిపల్ ఇంజినీర్ ఎ.ఎస్.ఎన్ ప్రసాద్, పాల్గొన్నారు.



అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే వెనిగండ్ల

పట్టణంలో ఆటోమ్యూటేషన్ సులభతరం

● మున్సిపల్ కమిషనర్ సింహాద్రి మనోహర్

గుడివాడ, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం పట్టణ ప్రజలసౌలభ్యం కోసం గుడివాడ పురపాలక సంఘం పరిధిలో ఆటోమ్యూటేషన్(రిజిస్ట్రేషన్ సమయంలోనే ఇంటి పన్ను పేరు మార్పు) ప్రవేశపెట్టామని మున్సిపల్ కమిషనర్ సింహాద్రి మనోహర్ తెలిపారు. బుధవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలోని కమిషనర్ ఛాంబర్‌లో రెవెన్యూ శాఖ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మున్సిపల్ పరిధిలోని ఇళ్లు, ఖాళీ స్థలాలకు సంబంధించి రిజిస్ట్రేషన్లు అవనప్పుడు రిజిస్ట్రేషన్ ఫీజుతో పాటుగా ఇంటిపన్ను పేరు మార్పునకు సంబంధించిన మ్యూటేషన్ ఫీజు సైతం చెల్లించాలన్నారు. రిజిస్ట్రేషన్ పురపాలక సంఘ రికార్డుల్లో ఇంటిపన్ను పేరు మార్పు ఒకేసారి పొందవచ్చునన్నారు. పట్టణ ప్రజలు రిజిస్ట్రేషన్ సమయంలో ఆస్తి పన్ను అసెస్మెంట్ నెంబరును విధిగా రిజిష్టర్ కార్యాలయంలో తెలియజేయాలన్నారు. ప్రజలందరూ తప్పనిసరిగా ఈ సౌకర్యాన్ని వినియోగించుకుని ఒకేసారి రిజిస్ట్రేషన్, మున్సిపల్ రికార్డుల్లో పేరు మార్చుకునే సౌకర్యం ఉందని మున్సిపల్ కమిషనర్ మనోహర్ తెలిపారు.



అధికారులతో మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ మనోహర్

ధనుర్మాస వ్రతాలు 16న


పమిడిముక్కల: మంటాడ వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో ఈనెల 16 నుంచి జనవరి 14 వరకు ధనుర్మాస వ్రత మహోత్సవాలను నిర్వహిస్తున్నట్టు ఆలయ అధికారి వి.డి.డి. ప్రసాద్ ఓ ప్రకటనలో తెలిపారు.



స్వామిని సూర్యప్రభ వాహనంపై ఊరేగిస్తున్న భక్తులు

వైభవంగా శ్రీవారి గ్రామోత్సవం

గుడ్లవల్లేరు, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : డోకిపర్రులోని భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయ వార్షిక సాలకట్ల బ్రహ్మోత్సవాల్లో రెండవ రోజు బుధవారం స్వామిని సూర్యప్రభ వాహనంపై, శేష, హంస వాహనాలపై గ్రామోత్సవాలు కన్నుల పండుగగా నిర్వహించారు. వేదపండితుల మంత్రోచ్ఛరణల నడుమ, భక్తుల గోవింద నామస్మరణలతో డోకిపర్రు మార్మోగింది. తెలుత గరుక్మంతుని రూపాన్ని ఆలయంలోని ధ్వజస్థంభానికి ఆరోహణం చేసి ధ్వజారోహణం చేశారు. స్వామివార్ల ఉత్సవ మూర్తులను సూర్యప్రభ వాహనంపై ఉంచి ఆలయ ప్రధాన వాకిలికి తీసుకొని వచ్చి భక్తులకు దర్శనం ఇచ్చారు. అనంతరం శేష, హంస వాహనాలపై స్వామివార్ల ఉత్సవ మూర్తులు డోకిపర్రులో ఊరేగించారు.సాయంత్రం స్వామివారి రథోత్సవం, ఊంజలసేవ, గరుడోత్సవం, ఆస్థానం, ఏకాంత సేవలు నిర్వహించారు. ఆలయ వ్యవస్థాపక ధర్మకర్తలు పీ.వీ కృష్ణారెడ్డి, సుధారెడ్డి దంపతుల పర్యవేక్షణలో విజయ భాస్కరరెడ్డి, విజయ భాస్కరమ్మ, పి.నాగిరెడ్డి, ప్రసన్న, వెంకటలక్ష్మి పాల్గొన్నారు.



ఏజీకేలో పిల్లలకు భోజనం వడ్డిస్తున్న ఎంఈవో రజని

దాతల సాయం అభినందనీయం

గుడివాడ రూరల్: ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పిల్లలకు మధ్యాహ్న భోజనం కింద దాతలు ముందుకు రావటం సంతోషకరమని ఎంఈవో-1 రజని అన్నారు. బుధవారం ఏజీకే ఉన్నత పాఠశాల విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం కింద లైన్‌మెన్ నగదు వితరణ చేయగా, ఉపాధ్యాయులు, ఎంఈవో రజని ఆధ్వర్యంలో చక్కగా భోజనం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు దాతలు సహాయ సహకారాలు అందిస్తే వారికి మెరుగైన విద్య అందించేందుకు కృషి చేస్తామన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు సహకారం అందిస్తే వారు బాగా చదువుతారని తెలిపారు.

అన్నదాతలను ప్రభుత్వం ఆదుకోవాలి

కూచిపూడి: అన్నదాతలను ఆదుకునేందుకు ప్రభుత్వం యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టాలని మాజీ ఎమ్మెల్యే కైలే అనిల్ కుమార్ పేర్కొన్నారు. రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై వైసీపీ నేతలు, కార్యకర్తలతో కలసి బుధవారం మొవ్వ తహసీల్దార్ కె.మస్తాన్‌కు వినతిపత్రం అందజేశారు. తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ నేతలు రాజులపాటి రాఘవరావు, మండా శ్రీనివాసరెడ్డి, తాతా రాంబాబు, రాజులపాటి మురళీ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి గింజనూ కొనుగోలు చేస్తాం

● ఏవో అనంతలక్ష్మి

గుడివాడ రూరల్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): రైతులు పండించిన ప్రతి గింజనూ కొనుగోలు చేస్తామని, పండించిన ధాన్యాన్ని సంచుల ద్వారా మిల్లర్లకు అందిస్తామని ఏవో బోలెం అనంతలక్ష్మి అన్నారు. లింగవరంలో కొంతమంది రైతులు తమ ధాన్యాన్ని తీసుకెళ్లటం లేదని ఆందోళన చెందగా, తహసీల్దార్ కిరణ్ స్పందించి లింగవరం వెళ్లి నేరుగా రైతులతో మాట్లాడారు. పండించిన ధాన్యాన్ని కొనుగోలు చేయిస్తామని తెలిపారు.

పామర్రు: తుఫాను ప్రభావంతో కురుస్తున్న వర్షాలకు ఆరుగాలం కష్టపడి పండించిన ధాన్యం పంటను కాపాడుకునేందుకు మండలంలోని అన్నదాతలు బుధవారం నానా అగచాట్లు పడుతున్నారు. కొందరు రైతులు వచ్చినకాడికి స్థానిక బేరగాళ్లకు రూ.1400కి అమ్మకుంటున్నామని చెబుతున్నారు.



లింగవరంలో రైతులతో మాట్లాడుతున్న ఏవో బోలెం అనంతలక్ష్మి



మొవ్వలో ధాన్యాన్ని ఆరబెడుతున్న కూలీలు

కూచిపూడి: దిత్వా తుపాను కారణంగా కురుస్తున్న వర్షాలు రైతులను కోలుకోలేని దెబ్బతీసింది. వరి కోతలు ముమ్మరంగా ప్రారంభమై సంచుల కొరత, లారీల కొరత కారణంగా ఎక్కడ ధాన్యం అక్కడే నిలిచిపోవటంతో రైతన్నలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వరుస దెబ్బలతో రైతులు అతలాకుతలమవుతున్నారు.అధికారులు, ప్రజాప్రతినిధులు వట్టి మాటలతో కాలం వెళ్లబుచ్చుతున్నారని వాపోతున్నారు. కూలీల ఖర్చు, పరదాల ఖర్చు తడిసి మోపెడవుతుందని రైతులు వాపోతున్నారు.

దాడి చేసిన వ్యక్తిపై కేసు నమోదు

గుడివాడ రూరల్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): కుటుంబ కలహాల నేపథ్యంలో బంధువుల మధ్య నెలకొన్న ఘర్షణపై కేసు నమోదు చేసిన ఘటన దొండపాడులో చోటుచేసుకుంది. భార్యాభర్తల మధ్య గొడవలు జరుగుతుండగా, చిట్టిబొమ్మ నాగేంద్రబాబు వెంకటేశ్వరరావుకు సర్దిచెప్పే విషయంలో చిట్టిబొమ్మ వెంకటేశ్వరరావు కత్తితో దాడి చేసినట్లు ఫిర్యాదు దారుడు పేర్కొనట్లు తెలిపారు. చిట్టిబొమ్మ నాగేంద్రంబాబు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్సై చంటిబాబు తెలిపారు.

మోటూరులో..

గుడివాడరూరల్: దారం మల్లేశ్వరరావు అతని భార్యపై నవంబరు 30వ తేదీ రాత్రి అదే గ్రామానికి చెందిన కుమార్ భార్యాభర్తలిద్దరి చేతులు, కాళ్లతో తన్ని దాడి చేయగా, శరీరంలో గాయాలయ్యాయని తెలిపారు. మోటూరుకు చెందిన దారం మల్లేశ్వరరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై చంటిబాబు తెలిపారు.

రైతుల శ్రేయస్సే కూటమి ధ్యేయం

● ఎమ్మెల్యేలు వెనిగండ్ల , వర్ల

గుడివాడ రూరల్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): రైతు శ్రేయస్సే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పని చేస్తోందని గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు. బుధవారం మోటూరు పీఏసీఎస్ వద్ద రైతన్నా మీ కోసం ముగింపు ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. పీఏసీఎస్ ఛైర్మన్ చీకటి శేషగిరి అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతులకు ఆర్థిక ప్రయోజనాలు చేకూర్చటానికి తమ ప్రభుత్వం ఎప్పుడూ ముందున్నట్టు తెలిపారు. అధికారులతో సమన్వయం చేసుకుంటూ గుడివాడ నియోజకవర్గంలోని ధాన్యాన్ని మిల్లర్లు, ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నట్లు వివరించారు. కూటమి ప్రభుత్వం ప్రజలు, అధికారులు, రైతుల నుంచి వివరాలు అడిగి తెలుసుకుని వారికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా సంచులు, ట్రాన్స్‌పోర్టు ఏర్పాటు చేసి రైతులను ఆదుకున్నట్లు తెలిపారు. జనసేన నియోజకవర్గ ఇంచార్జ్ బూరగడ్డ శ్రీకాంత్, టీడీపీ మండల అధ్యక్షుడు వాసే మురళీ, గుడివాడ మార్కెట్ యార్డు ఛైర్మన్ చాట్రగడ్డ రవికుమార్, జగన్మోహనరావు, తహసీల్దార్ కిరణ్, ఏడీఏ సూరపనేని కవిత, ఏవో బోలెం అనంతలక్ష్మీ, టీడీపీ నాయకుల పాండురంగారావు, మోటూరు పీఏసీఎస్ కార్యదర్శి నారాయణరావుపాల్గొన్నారు.



రైతులకు టార్పాలిన్ పరదాలను అందజేస్తున్న ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా

పామర్రు : దిత్వా తుపాను వల్ల కురుస్తున్న వర్షాలకు రైతన్నలెవరూ అధైర్య పడొద్దని ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా అన్నారు. మండల పరిధిలోని కురుమద్దాలి ఆర్‌ఎస్‌కే వద్ద బుధవారం నిర్వహించిన రైతన్న మీకోసం కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిధిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయనకు పలువురు గ్రామ రైతులు రోడ్లపై ఆరబోసి ధాన్యం ఎగుమతికి పడుతున్న అవస్థలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. తక్షణమే తహసీల్దార్‌ను పిలిచి రైతులకు అవసరమైన లారీలు, సంచులను, టార్పాలిన్లు అందించాలని ఎమ్మెల్యే ఆదేశించారు. మండల వ్యవసాయాధికారి వి.శివనాగరాణి, గ్రామసర్పంచ్ విజయభారతి, కొనరాజు వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే వెనిగండ్ల రాము

కూచిపూడి : రైతన్నా మీకోసం కార్యక్రమాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని మొవ్వ సబ్ డివిజన్ ఏడీఏ ఎస్.శ్యామల రైతులకు సూచించారు. మండల పరిధిలోని మంత్రిపాలెంలో నిర్వహించిన రైతన్నా మీ కోసం కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం రైతులకు అందిస్తున్న పథకాలను, సబ్సిడీలను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. జిల్లా శిక్షణా కేంద్రం డీడీఏ కె.జ్యోతిరమణి, ఏడీఏ శ్రీనివాసరావు, ఏవో పద్మజ, మొవ్వ ఏవో సురేష్‌బాబు నాయక్, పీఏసీఎస్ అధ్యక్షుడు కొండపల్లి ఆత్రేయ, పాల్గొన్నారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	144, 153, 164
చికెన్ విత్ స్కిన్	274
చికెన్ స్కిన్‌లెస్	284

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 670

రేపు మెగా జాబ్‌మేళా

మచిలీపట్నం టౌన్ , డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): చిలకలపూడి ఇంజనీరింగ్ కళాశాలలో సీడ్స్, సుజనా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈనెల 5 వతేదీన మెగా జాబ్‌మేళా నిర్వహించనున్నట్టు ప్రిన్సిపాల్ రవికుమార్ తెలిపారు. బుధవారం తన చాంబర్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. టాటా, ఎంఆర్ఎఫ్, టీవీఎస్ వంటి 18 మెగా కార్పొరేట్ కంపెనీల ప్రతినిధులు జాబ్‌మేళాకు వస్తున్నారన్నారు. ఇంజనీరింగ్, పాలిటెక్నిక్, డిగ్రీ విద్యార్థులు హాజరుకావచ్చన్నారు. 5వతేదీ ఉదయం 8 గంటలనుంచి రిజిస్ట్రేషన్ కార్యక్రమం ప్రారంభమవుతుదన్నారు. ఈ జాబ్‌మేళా ప్రారంభోత్సవంలో ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు, కలెక్టర్ డీకే బాలాజీ, ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు, వైజేఆర్ డీఎంఎస్ కళాశాల కమిటీ ప్రెసిడెంట్ పీవీ రావు తదితరులు పాల్గొంటారన్నారు.

నేటి నుంచి పైడమ్మ జాతర

పెడన, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): పైడమ్మ జాతర ఉత్సవాలు గురువారం నుంచి ప్రారంభమవుతాయి. 11 రోజుల పాటు అంగరంగ వైభవంగా జరిగే ఈ ఉత్సవాలు ఈనెల 14వ తేదీతో ముగుస్తాయి. జాతర ఉత్సవాలను పురస్కరించుకుని ప్రత్యేక అలంకరణ కోసం మచిలీపట్నం వెళ్లిన అమ్మవారు గురువారం ఉదయం మచిలీపట్నం నుంచి బయలుదేరి రాత్రికి పెడన పట్టణంలోకి ప్రవేశిస్తారు. ఆమె ప్రవేశంతో ఉత్సవాలు ప్రారంభమవుతాయి. ఆలయ ఈవో గోవాడ వెంకట కృష్ణారావు, వ్యవస్థాపక ధర్మకర్త దాసు వాయునందనరావు, ట్రస్టు బోర్డు సభ్యుల ఆధ్వర్యంలో ఉత్సవాల నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లు చేశారు.

సుబ్బారాయుడి సేవలో

ఐఏఎస్ అధికారి అయ్యంగార్



స్వామి చిత్రపటం, ప్రసాదాలను ఐఏఎస్ అధికారి జి.ఎస్.జి అయ్యంగార్‌కు అందిస్తున్న ఆలయ పర్యవేక్షకులు

మోపిదేవి, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): సుబ్రహ్మణ్యేశ్వరస్వామిని ఐఏఎస్ అధికారి డాక్టర్ జి.ఎస్.జి.అయ్యంగార్ బుధవారం దర్శించుకున్నారు. ఆలయ అధికారులు, అర్చక బృందం స్వాగతం పలికారు. నాగపుట్టలో పాలు పోసి స్వామిని దర్శించుకుని పూజలు చేశాక, అయ్యంగార్ దంపతులకు ఆలయ పర్యవేక్షకుడు మధుసూదనరావు స్వామి చిత్రపటం, ప్రసాదాలను అందించారు.

వృద్ధుడు కనిపించడం లేదని ఫిర్యాదు



బెల్లంకొండ పోతురాజు

కోడూరు, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని మందపాకల గ్రామానికి చెందిన బెల్లంకొండ పోతురాజు(70) మంగళవారం ఉదయం నుంచి కనిపించడం లేదని కుటుంబసభ్యులు ఫిర్యాదు చేశారని బుధవారం ఎస్సై చాణక్య తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు పోలీస్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని ఆయన సూచించారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

మచిలీపట్నం టౌన్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): డీ మార్ట్ వద్ద బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో బోదా విజయ్‌కుమార్ అనే వ్యక్తికి గాయాలయ్యాయి. బైక్‌పై వస్తున్న విజయ్‌కుమార్ నిమ్మకాయల బండిని తప్పించబోయి ప్రమాదానికి గురయ్యాడు. 108 వాహనంలో ఆయనను అక్కడి ప్రజలు ప్రభుత్వ ఆసుపత్రికి పంపారు.

వీర్నాల ఫౌండేషన్ ఆధ్వర్యంలో

విద్యార్థులకు పోటీలు

మచిలీపట్నం టౌన్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): వీర్నాల ఫౌండేషన్ ఆధ్వర్యంలో జనవరి 8,9 తేదీల్లో విద్యార్థులకు చదరంగం, క్విజ్, సైన్స్ ఒలింపియాడ్, కబడ్డీ పోటీలు నిర్వహిస్తున్నామని ఫౌండేషన్ ప్రతినిధులు సందీప్, మానస తెలిపారు. బుధవారం సన్‌స్టార్ స్కూల్, సన్‌స్టార్ కళాశాలల్లో విద్యార్థులకు వారు ఆహ్వాన పత్రికలు అందజేశారు. 8, 9, 10, ఇంటర్ పోటీల్లో పాల్గొనే విజేతలకు ప్రథమ బహుమతి రూ.10 వేలు, ద్వితీయ బహుమతి రూ. 5 వేలు, తృతీయ బహుమతి రూ. 2500 ప్రదానం చేస్తామన్నారు. కబడ్డీ పోటీల్లో ప్రథమ బహుమతిగా రూ.50 వేలు, ద్వితీయ బహుమతిగా రూ. 30 వేలు, తృతీయ బహుమతిగా రూ. 20వేలు అందిస్తామన్నారు. జనవరి 11న నిర్వహించే 3కే రన్‌లో పాల్గొన్న వారికి లక్కీడీప్ ద్వారా 25 మందికి ఒక్కొక్కరికి రూ. 5 వేలు బహుమతిగా అందిస్తామన్నారు.

నేడు ప్రజా దర్బార్

కోడూరు, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ కార్యాలయంలో ప్రజాదర్బార్ కార్యక్రమాన్ని గురువారం మధ్యాహ్నం 3 గంటలకు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో సుధా ప్రవీణ్ తెలిపారు. ప్రజల నుంచి ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్, నియోజకవర్గ ప్రత్యేకాధికారి పెనుమూడి సాయిబాబు అర్జీలు స్వీకరిస్తారని తెలిపారు. మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

కౌశల్ క్విజ్‌కు నాగాయలంక విద్యార్థి

నాగాయలంక, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): నాగాయలంక జడ్పీ పాఠశాలలో పదో తరగతి చదువుతున్న చాపల మోక్షజ్ఞ జిల్లాస్థాయి కౌశల్ క్విజ్‌లో ద్వితీయ స్థానం సాధించి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యాడని ప్రధానోపాధ్యాయుడు అల్లపర్తి సత్యనారాయణ తెలిపారు. గైడ్ టీచర్ కొమ్మినేని ఉదయ్ కుమార్‌ను, మోక్షజ్ఞను హెచ్‌ఎం, ఎస్ఎంసీ చైర్మన్ వక్కపట్ల లీలా మారుతిఅభినందించారు.

రాష్ట్ర పోటీలకు బల్లిపర్రు విద్యార్థిని శీలం చైత్ర

పెడన: రాష్ట్రస్థాయి సైన్స్ ప్రతిభాన్వేషణ(కౌశల్ - 2025)కు బల్లిపర్రు జడ్పీ హైస్కూల్ విద్యార్థిని శీలం చైత్ర ఎంపికయింది. చైత్రకు ప్రధానోపాధ్యాయిని లక్ష్మీదేవి గైడ్‌గా వ్యవహరించారు. ఈనెల 27న తిరుపతి నేషనల్ సంస్కృత యూనివర్సిటీలో నిర్వహించే పోటీల్లో చైత్ర పాల్గొంటుంది.

బేస్‌బాల్, స్విమ్మింగ్ జాతీయ పోటీలకు

నాగాయలంక హైస్కూల్ విద్యార్థినులు



విద్యార్థినులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

నాగాయలంక, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): అహోబిలంలో నిర్వహించిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ అండర్-17 బేస్‌బాల్ పోటీల్లో నాగాయలంక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల బాలికలు తమ్ము తనూష, పి.వల్లీశ్రీ అద్భుత ప్రదర్శన కనబర్చి జాతీయ పోటీలకు ఎంపికయ్యారు. గత నెలలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో నరసరావుపేటలో స్విమ్మింగ్ కాంపిటీషన్ జరుగగా, నాగిడి అశ్విని సిల్వర్ మెడల్ సాధించి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయింది. విద్యార్థినులను ఎస్ఎంసీ చైర్మన్ వక్కపట్ల లీలా మారుతి, పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ జి.ఎల్.ప్రసాద్, కె.శివాజీ అభినందించారు.



చల్లపల్లి, మోపిదేవి వద్ద జాతీయ రహదారిపై, అశ్వారావుపాలెంలో ధాన్యం ఆరబెడుతున్న రైతులు

ధాన్యం ఆరబెట్టుకున్న రైతాంగం

వాతావరణం బుధవారం కొంత అనుకూలించి తెరిపి ఇవ్వడంతో రైతులు ధాన్యపు రాశులను ఆరబెట్టుకునే పనిలో నిమగ్నమయ్యారు. మంగళవారం రాత్రి వర్షం కురవడంతో కోతలు పూర్తయి పనలమీదున్న వరి పూర్తిగా తడిసింది. పనలు పూర్తిగా ఆరాక మళ్లీ తిరగేయాలి. **- చల్లపల్లి/ మోపిదేవి/ అవనిగడ్డ రూరల్**

కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించండి

● దళారులను నమ్మి తక్కువ ధరకు అమ్ముకోవద్దు: తహసీల్దార్ వనజాక్షి



లక్ష్మీపురం వద్ద హైవేపై రైతులతో మాట్లాడుతున్న తహసీల్దార్ వనజాక్షి

చల్లపల్లి, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): కొనుగోలు కేంద్రాల్లోనే రైతులు ధాన్యం విక్రయించుకోవాలని, దళారులను నమ్మి తక్కువ ధరకు అమ్ముకోవద్దని తహసీల్దార్ డి.వనజాక్షి సూచించారు. బుధవారం లక్ష్మీపురం, పురిటిగడ్డ, పాగోలు, మంగళాపురం గ్రామాల్లో ఆమె పర్యటించారు. ధాన్యం ఆరబోసుకున్న రైతులతో మాట్లాడారు. 25, 26 తేమ శాతం ఉన్న ధాన్యాన్ని సైతం కొనుగోలు కేంద్రాల ద్వారా విక్రయించుకోవచ్చని, వాతావరణ పరిస్థితులు ఇంకా పూర్తిగా బాగోనందున దళారులబారిన పడకుండా కొనుగోలు కేంద్రాల్లో విక్రయించుకోవాలని సూచించారు. పురిటిగడ్డ, లక్ష్మీపురం సొసైటీలకు వెళ్లి కొనుగోలు కేంద్రం వారితో మాట్లాడి తగు సూచనలు చేశారు. చల్లపల్లిలోని మెహెర్ రైస్‌మిల్‌ను సందర్శించారు. ధాన్యం సేకరణ వివరాలు తెలుసుకున్నారు. సొసైటీల సీఈవోలు, రైతులు, కొనుగోలు కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లపై

ఆందోళన వద్దు

● దివి మార్కెట్ కమిటీ చైర్మన్ కొల్లూరి వెంకటేశ్వరరావు

అవనిగడ్డ రూరల్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోళ్లపై రైతులు ఆందోళన చెందవద్దని, ప్రతీ ధాన్యపు గింజను కూటమి ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని దివి మార్కెట్ కమిటీ చైర్మన్ కొల్లూరి వెంకటేశ్వరరావు భరోసా ఇచ్చారు. మోదుమూడి గ్రామంలో బుధవారం రైతన్నా.. మీ కోసం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. పంచ సూత్రాలపై రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఏడీఏ జయప్రద, వ్యవసాయశాఖాధికారులు, కూటమి నాయకులు బచ్చు మల్లికార్జునరావు, బచ్చు శ్రీహరి, మెరుగు సోమిరెడ్డి, బచ్చు వెంకటేశ్వరరావు, రైతులు పాల్గొన్నారు.

ఎయిడ్స్ బాధితులపై వివక్ష చూపొద్దు

● డీఎంహెచ్‌వో యుగంధర్

మచిలీపట్నం టౌన్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : ఎయిడ్స్ అంటు వ్యాధి కాదని, ఎయిడ్స్ బాధితుల పట్ల వివక్ష చూపొద్దని డీఎంహెచ్‌వో యుగంధర్ సూచించారు. బుధవారం ఎయిడ్స్ కేంద్రంలో ఎయిడ్స్ వ్యాధిగ్రస్తులతో కలిసి ఆయన భోజనం చేశారు. వారి ఆరోగ్యం, మందుల వాడకాన్ని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీఎంహెచ్‌వో వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులను ప్రోత్సహిస్తే అద్భుతాలు సాధిస్తారు

సమగ్ర శిక్ష జిల్లా అడిషనల్ ప్రాజెక్టు కో ఆర్డినేటర్ ఆర్.కుముదిని సింగ్



మచిలీపట్నం భవిత కేంద్రంలో విభిన్న వేషధారణలో వచ్చిన చిన్నారులతో కుముదిని సింగ్



పెడనలో దివ్యాంగ విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న ఎంఈవో సలోమి, ఎంఈవో 2 హరనాథ్

మచిలీపట్నం టౌన్, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): దివ్యాంగులను ప్రోత్సహిస్తే అద్భుతాలు సాధించగలరని జిల్లా సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్టు కో ఆర్డినేటర్ ఆర్.కుముదిని సింగ్ తెలిపారు. ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా బుధవారం భవిత సెంటర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఎంఈవో-1 దుర్గాప్రసాద్, ఎంఈవో -2 గురుప్రసాద్, సహిత విద్య జిల్లా సమన్వయకర్త కళ్లేపల్లి ఏడుకొండలు, ఎఎల్ఎస్ కోఆర్డినేటర్ రామకృష్ణ, ఐసీడీఎస్ ఇన్‌స్ట్రక్టర్లు, ఐఈఆర్‌పీలు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు. దివ్యాంగ విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి.

రామానగరంలో..



దివ్యాంగురాలికి శుభాకాంక్షలు చెబుతున్న స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ డైరెక్టర్ బోలెం నాగమణి

చల్లపల్లి: దివ్యాంగుల ఐక్యసేవాసంఘం - రామానగరం ఆధ్వర్యంలో రామానగరం కమ్యూనిటీ హాలులో అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని నిర్వహించారు. స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ డైరెక్టర్ బోలెం నాగమణి, చల్లపల్లి సీఐ కె.ఈశ్వరరావు ముఖ్య అతితులుగా పాల్గొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం దివ్యాంగుల సంక్షేమం కోసం కృషిచేస్తోందని, పెన్షన్‌ను ఆరువేలకు పెంచిందని స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ డైరెక్టర్ బోలెం నాగమణి తెలిపారు. మదర్‌థెరెస్సా సంస్థ నిర్వాహకులు గురుప్రసాద్, లయన్స్‌క్లబ్ మాజీ అధ్యక్షుడు అడపా గురవయ్య, సీహెచ్ సుధాకర్ పాల్గొన్నారు.

పెడన: బంగ్లా స్కూల్‌లోని దివ్యాంగ విద్యార్థుల భవిత కేంద్రంలో సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం నిర్వహించారు. దివ్యాంగ విద్యార్థులకు పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఎంఈవో ఎస్.సలోమి, ఎంఈవో-2 వై.వి. హరనాథ్, రిటైర్డు డీవైఈవో మట్టా రాధాకృష్ణమూర్తి, హెచ్‌ఎం జి. భాగ్యలక్ష్మి, సహిత విద్య రిసోర్సు పర్సన్లు రమ్య, అబ్దుల్ హమీద్ పాల్గొన్నారు.

దివ్యాంగులకు పోటీలు

కోడూరు: దివ్యాంగుల పట్ల సానుభూతి కాకుండా సమాన అవకాశాలు కల్పించడం సామాజిక బాధ్యత అని ఎంఈవో-2 నాంచారయ్య తెలిపారు. ఎంఆర్సీ కార్యాలయంలో ఐఈఆర్టీ రంగాదేవి ఆధ్వర్యంలో నిర్వహించిన దివ్యాంగుల తల్లిదండ్రులతో ప్రత్యేక సమావేశం, పిల్లలకు డ్రాయింగ్, మ్యూజికల్ చైర్ పోటీల్లో ఆయన పాల్గొన్నారు. విజేతలకు బహుమతులు అందజేశారు. డాక్టర్ పార్వతీ, వీర వెంకట ప్రసాద్ పాల్గొన్నారు.

ప్రజల్లోకి సంక్షేమ పథకాలు తీసుకెళ్లాలి

మచిలీపట్నం టౌన్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలతో పాటు వివిధ అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని టీడీపీ నాయకులకు దివి మార్కెట్ యార్డు చైర్మన్ కొల్లూరి వెంకటేశ్వరరావు సూచించారు. బుధవారం బందరు మండలం కొత్తపూడి గ్రామంలో టీడీపీ క్లస్టర్ కన్వీనర్ తలారి సోమశేఖరరావు, పరింకాయల శివాజీతో కలిసి ఆయన పర్యటించారు. రానున్న పంచాయతీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని ఓటర్లను చైతన్యవంతం చేయాలని పిలుపునిచ్చారు.

అగస్త్యేశ్వరస్వామి ఆలయ

హుండీల ఆదాయం రూ.1,12,299

పెడన, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): అగస్త్యేశ్వర స్వామి ఆలయంలోని హుండీలను బుధవారం లెక్కించారు. ఆలయ ఈవో జీ.వి. కృష్ణారావు ఆధ్వర్యంలో అభివృద్ధి కమిటీ చైర్మన్ బళ్ల ప్రసాద్, చందన నారాయణరావు, కొల్లూరి రాధాకృష్ణగుప్తా సమక్షంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. సెప్టెంబరు నుంచి బుధవారం వరకు హుండీల ద్వారా ఆలయానికి లక్షా 12వేల 299 రూపాయల ఆదాయం సమకూరిందని తెలిపారు.

పేద కుటుంబానికి ఆర్థిక సాయం

అవనిగడ్డ, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): తండ్రిని కోల్పోయిన బాలికలకు అండగా ఉంటామని నియోజకవర్గ యువ నాయకుడు మండలి వెంకట్రామ్ హామీ ఇచ్చారు. 8వ వార్డుకు చెందిన పుల్లా రాంబాబు (34) ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా, వారి ముగ్గురు కుమార్తెలను బుధవారం వెంకట్రామ్ పరామర్శించారు. జనసేన పార్టీ మండల ప్రధాన కార్యదర్శి బచ్చు శ్రీహరి రూ.5 వేల సాయాన్ని వెంకట్రామ్ చేతులమీదుగా అందజేశారు. కూటమి నాయకులు మత్తి వెంకటేశ్వరరావు, బచ్చు వెంకట్‌నాథ్ ప్రసాద్, యాసం చిట్టిబాబు, బచ్చు మల్లికార్జునరావు, బచ్చు రామారావు, భోగాది బాలకృష్ణ, లుక్కా శ్రీను, చంద్ర, పెనుమాక రమేష్, బండెల పసి పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా అవగాహన

గూడూరు, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఆకులమన్నాడు పంచాయతీ పరిధిలోని ఆకులమన్నాడుపాలెంలో గ్రామ సర్పంచ్ మహమ్మద్ రఫీ ఆధ్వర్యంలో బుధవారం సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై గ్రామస్థులకు అవగాహన కల్పించారు. ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఆరోగ్య సిబ్బంది సూచించారు. హెల్త్ అసిస్టెంట్ సుబ్రహ్మణ్యం, సీహెచ్‌వో డాలీ సుకన్య, ఎంపీహెచ్ఈవో వీరయ్య, ఏఎన్ఎం మార్తారాణి, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

యార్లగడ్డలో రైతన్నా..మీకోసం

చల్లపల్లి, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రైతుసేవా కేంద్రాల్లో బుధవారం రైతన్నా..మీకోసం కార్యక్రమం నిర్వహించారు. యార్లగడ్డలో నిర్వహించిన కార్యక్రమంలో ఏవో కె.మురళీకృష్ణ ముఖ్యమంత్రి కార్యక్రమాన్ని లైవ్ ద్వారా రైతులకు చూపించి కార్యక్రమ లక్ష్యాలను వివరించారు. వీఏఏలు, సొసైటీల సీఈవోలు, రైతులు పాల్గొన్నారు.

నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించేందుకే కౌశలం

పెడన రూరల్, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): నిరుద్యోగ యువతకు ఉద్యోగావకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం కౌశలం కార్యక్రమాన్ని నిర్వహిస్తోందని ఎంపీడీవో ఎ.అరుణకుమారి తెలిపారు.. దీనిలో ఉద్యోగం సంపాదించిన వారు ఇంటి వద్ద నుంచే ఉద్యోగం చేయొచ్చని తెలిపారు. డిసెంబరు 2వ తేదీ నుంచి 6వ తేదీ వరకు డిగ్రీ, ఇంజనీరింగ్ పూర్తిచేసి, దరఖాస్తు చేసుకున్న నిరుద్యోగులకు ఆయా సచివాలయాల్లో ఆన్‌లైన్ పరీక్షలు నిర్వహిస్తున్నామన్నారు. ఒక్కో సచివాలయంలో ఉదయం ఒకరు మధ్యాహ్నం ఒకరు మాత్రమే పరీక్ష రాసే వీలుందని సచివాలయ పర్యవేక్షకుడు, డిప్యూటీ ఎంపీడీవో హేమప్రకాష్ తెలిపారు. చెన్నూరు, కమలాపురం, మడక, చోడవరం, పెనుమల్లి, నడుపూరు సచివాలయాలలో అభ్యర్థులతో హేమప్రకాష్ మాట్లాడి సూచనలు చేశారు. మంగళవారం జరిగిన పరీక్షలకు 14 మంది హాజరయ్యారని తెలిపారు.

అతివేగం వద్దు...నిదానమే ముద్దు

కోడూరు, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): వాహనాలు అతివేగంగా నడపవద్దని నిదానమే ముద్దని ఎస్సై చాణక్య సూచించారు. బుధవారం కోడూరు ప్రధాన సెంటర్‌లో సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేసే యువకులకు, వాహనాలు అతివేగంగా నడిపే వారికి ఆయన అవగాహన కల్పించారు. అతివేగంతో వాహనాలు నడిపి ప్రమాదాల బారిన పడి కుటుంబసభ్యులకు దూరమైతే పరిస్థితి ఏంటో గుర్తెరిగి వాహనాలు నడపాలని ఆయన సూచించారు.

స్క్రబ్ టైఫస్ నివారణపై అవగాహన

మోపిదేవి, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): స్క్రబ్ టైఫస్ వ్యాధి నివారణ చర్యలపై పెదకళ్లేపల్లి పీహెచ్‌సీ ఆధ్వర్యంలో సోమవారం గ్రామస్థులకు అవగాహన కల్పించారు. పీహెచ్‌సీ వైద్యాధికారులు డాక్టర్ అర్షియా, డాక్టర్ శ్రీరామ్ సాయిల ఆధ్వర్యంలో వైద్యఆరోగ్యశాఖ సిబ్బంది గ్రామంలో ప్రధాన రహదారులు, ఇంటింటికి వెళ్లి ముందస్తు జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. మూడు రోజులకుపైగా జ్వరం, శరీరం నొప్పులు, తీవ్రమైన అలసట ఉంటే సమీపంలోని వైద్యాధికారులను సంప్రదించి పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ సుధాకర్, ఎంపీహెచ్ఈవో బాబూరావు పాల్గొన్నారు.

వైభవంగా హనుమత్ వ్రతాలు



పరాసుపేట ఆంజనేయస్వామి దేవాలయంలో వ్రతంలో పాల్గొన్న దంపతులు

అవనిగడ్డ, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): సువర్చలా సమేత ఆంజనేయస్వామి(గాలిగోపురం) ఆలయంలో హనుమత్ వ్రతాలను బుధవారం వైభవంగా నిర్వహించారు. ఉదయం నుంచి స్వామికి పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించారు. అనంతరం స్వామికి ప్రత్యేక పూజలు, అలంకారాలు నిర్వహించి వ్రత ప్రాముఖ్యతను కథల రూపంలో వివరించారు. రెడ్రౌతు రామ్మోహనరావు, శ్రీనివాస్ దంపతులు స్వామికి ప్రత్యేక అర్చనలు నిర్వహించగా, పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొని హనుమాన్ చాలీసా పారాయణను సామూహికంగా పఠించారు.

పరాసుపేటలో..

మచిలీపట్నం టౌన్: పరాసుపేట ఆంజనేయస్వామి దేవాలయంలో బుధవారం వైభవంగా హనుమత్ వ్రతాలు నిర్వహించారు. 108 మంది దంపతులు పాల్గొన్నారు. ఆలయ కమిటీ చైర్మన్ ఆలపాటి రమేష్, శివనాగేశ్వరరావు, ఉమాదేవి, సురేష్, బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ పి.వి.ఫణికుమార్, ఆలయ ఈవో తిక్కిశెట్టి రామ్మోహనరావు పాల్గొన్నారు.